ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 22 మార్చి 2024


నరసరావుపేట మండలం ములకలూరులో ఏడాదిగా పునాదులు దాటని తరగతి గది నిర్మాణం

అందుబాట్లో లేని.. ఆర్వోలు



- నియోజకవర్గాలకు చుట్టపుచూపుగా రాక
- కోడ్ అమల్లోకి వచ్చినా ఇంకా పాత ధోరణే
- జిల్లా కేంద్రాల్లోనే ఎక్కువ సమయం విధులు
- పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు
- ఏఈఆర్వోలపై అధికార పార్టీ నేతల కర్ర పెత్తనం
- సకాలంలో నిర్ణయాలు తీసుకోలేకపోతున్న అధికారులు

గుంటూరు, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి): ఆర్వో.. రిటర్నింగ్ ఆఫీసర్. ఎన్నికల్లో వీరిదే కీలకపాత్ర. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికలకు సంబంధించి అన్నీ వీరే చూడాలి. కోడ్ అమలు నుంచి అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత.. ఎన్నికల సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే. ఇంతటి కీలక బాధ్యతల్లో ఉన్న కొందరు ఆర్వోలు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు చుట్టపు చూపుగా వెళ్లి వస్తున్నారన్న విమర్శలున్నాయి. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనే నివాసం ఉంటూ కోడ్ అమలుని పర్యవేక్షిస్తూ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన వారు ఎక్కువ సమయం జిల్లా కేంద్రాల్లోనే ఉంటున్నారు. చివరకు ఎన్నికల సంఘం రాష్ట్ర ఉన్నతాధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకు కూడా కలెక్టరేట్ల నుంచే కొందరు హాజరౌతున్నారు. దీంతో కోడ్ అమలు చేసే భారం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లపై పడుతోంది. వీరిపై స్థానికంగా ఉండే నాయకులు పెత్తనం ఎక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో వారు సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఇదే అవకాశంగా పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు చెలరేగిపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా విభజన జరిగి దాదాపుగా రెండేళ్లు పూర్తి కావొస్తున్నా చాలామంది గుంటూరులోనే నివాసం ఉంటూ ఇక్కడి నుంచి వారి పని ప్రదేశాలకు వెళ్లి వస్తున్నారు. సాధారణ రోజుల్లో అంటే పెద్దగా పరిపాలనపై ప్రభావం ఉండదు. అయితే కోడ్ అమల్లోకి వచ్చిన సమయంలోనే పలువురు అదే వైఖరిని అవలంభిస్తున్నారు. ప్రత్తిపాడు, పొన్నూరు, మంగళగిరి, తాడికొండ ఆర్వోలు ఇక్కడే ఎక్కువ సమయం ఉంటున్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని నియోజకవర్గాల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్వోలలో కూడా కొందరు గుంటూరులోనే ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో కోడ్ సరిగా అమలు కావడం లేదని సమాచారం. షెడ్యూల్ విడుదల అయిన తరువాత జిల్లా అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లోనే సీఈవో ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. ఆర్వోలు ఆఫీసుల్లో కూర్చోవడం కాదు... క్షేత్రస్థాయికి వెళ్లాలి.. కోడ్ అమలుపై చర్యలు తీసుకోవాలని గట్టిగా హెచ్చరించారు. ఈ పరిస్థితికి కారణం పలువురు జిల్లా కేంద్రాలను దాటకపోవమేనని పలువురు చర్చించుకుంటున్నారు.

2019లో ఇలానే చేయగా...

2019 ఎన్నికల సమయంలోనూ కొంతమంది ఆర్వోలు ఇలానే చేయగా అప్పటి కలెక్టర్ కోన శశిధర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఆర్వో అయినా నియోజకవర్గం కేంద్రంలోనే ఉండాలని, వీడియో కాన్ఫరెన్స్‌లకు కూడా అక్కడి నుంచే హాజరు కావాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాంతో అప్పట్లో నరసరావుపేట లోక్‌సభ రిటర్నింగ్ అధికారి కార్యాలయం గుంటూరు కలెక్టరేట్ నుంచి నరసరావుపేట ఆర్డీవో కార్యాలయానికి మార్చారు. అప్పటి జేసీ హిమాన్షు శుక్లా నిత్యం అక్కడికే వెళ్లి సమావేశాలకు హాజరయ్యేవారు. ఇప్పుడు కూడా అధికారులు అలాంటి చర్యలు తీసుకోకపోతే సీఈవో ఆగ్రహానికి గురికాక తప్పదు.

నాడు నేడు.. పనులు నత్తేనయం అన్నట్లుగా సాగుతున్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిధులు రాక ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల తరగతి గదులు నిర్మాణ సామగ్రితో నిండిపోగా, విద్యార్థులకు తరగతులను ఆరుబయట చెట్ల కింద నిర్వహిస్తున్నారు. రెండో విడతలో చేపట్టిన పనులు ముందుకు సాగడంలేదు. పనుల పూర్తిపై నిర్లక్ష్యం తాండవిస్తోంది. అధికారులు సమీక్షలతో సరిపుచ్చుతున్నారు. విద్యాసంవత్సరం ముగియనున్నా పాఠశాలల్లో నాడు నేడు పనులు ఒక కొలిక్కి రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మొత్తం మీద నాడు నేడు పనులపై పాలకుల చిత్తశుద్ధి లోపంతో పురోగతి అంతంతమాత్రంగానే ఉంది.

నాడు నేడుకు.. నిధుల గండం


నరసరావుపేట మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడాదిగా నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

- పనులు నత్తనడకతో పోటీ
- విద్యా సంవత్సరం ముగుస్తున్నా పూర్తికాని పనులు
- వసతులు లేక విద్యార్థుల ఇక్కట్లు
- గదులు చాలక ఆరుబయట తరగతులు
- మూడు జిల్లాల్లో 3,138 పాఠశాలల్లో పనులు
- నిధులు మంజూరు రూ.699.28 కోట్లు
- విడుదల రూ.348.06 కోట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అమలు చేస్తున్న నాడు నేడు పథకం రెండో విడతలో చేపట్టిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. నిధులు కొరత వెంటాడుతోంది. పనులు అర్థంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులకు నిధులు విడుదల కావడంలేదని పాఠశాలల పేరెంట్స్ కమిటీలు చెబుతున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండో విడతలో 3,138 పాఠశాలల్లో పనులు చేపట్టారు. ఇందుకు రూ.699.28 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ 348.06 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. నిధులు సకాలంలో విడుదల కాకపోతుండటంతో పేరెంట్స్ కమిటీలు పనులను నిలిపివేశాయి. స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించక పోవడంతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

మున్సిపాల్టీల పరిధిలోని పాఠశాలల్లో పబ్లిక్ హెల్త్ శాఖ, గ్రామాల్లోని పాఠశాలల్లో పంచాయతీరాజ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, సమగ్ర శిక్ష శాఖల పర్యవేక్షణలో పనులు చేపట్టారు. మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి వసతి, ఫర్నిచర్, మేజర్, మైనర్ మరమ్మతులు, తరగతి గదులు, ప్రహరీల నిర్మాణం, గ్రీన్ చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్‌లు, భవనాలకు రంగులు వేసే పనులు చేపట్టారు.

ఉన్న గదులు కూల్చేశారు..

నిధుల లేమితో పాఠశాలల్లో పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా లేవు. పాఠశాలల్లో ఉన్న తరగతి గదులను కూల్చివేశారు. నూతన గదులు నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు తరగతి గదుల సమస్యను ఎదుర్కొంటున్నారు. నిధులు విడుదల చేయడంలో జాప్యంతో సొంత డబ్బుతో పనులు చేసేందుకు కమిటీలు ముందుకు రావడంలేదు. పనులు చేసి బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో పనులను పూర్తిగా నిలిపివేశారు. ఇప్పట్లో నిధులు విడుదల అయ్యేలా లేవని అధికారులు చెప్పకనే చెబుతున్నారు.

బాపట్ల జిల్లా...

బాపట్ల జిల్లాలో 943 పాఠశాలల్లో పనులు చేపట్టారు. రూ.183.31 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటికి రూ.88.35 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. పాఠశాలల్లో 6,265 పనులు చేపట్టారు. వీటిలో 4,099 పనులు పురోగతిలో ఉన్నాయి. 2,105 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 112 పాఠశాలల్లో 272 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. 11 గదుల నిర్మాణం పూర్తి చేశారు. 326 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌ను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టడం వంటి పనులను చేపట్టగా 153 చోట్ల పనులు పూర్తయ్యాయి. 78 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణ పనులను మంజూరు చేశారు. వీటిలో ఐదు పనులు పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా కోసం 326 పనులు చేపట్టగా 76 పనులు పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టగా 167 పనులను పూర్తి చేశారు.

గుంటూరు జిల్లా..

గుంటూరు జిల్లాలో 914 పాఠశాలల్లో పనులు చేపట్టారు. రూ.203.94 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటికి రూ.107.52 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. 914 పాఠశాలల్లో 6,476 పనులు చేపట్టారు. వీటిలో 3,778 పనులు పురోగతిలో ఉన్నాయి. 2,446 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 75 పాఠశాలల్లో 244 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. తొమ్మిది మాత్రమే అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేశారు. 394 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌ను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టడం వంటి పనులను చేపట్టారు. వీటిలో 190 స్కూల్స్‌లో పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తికాక అనేక స్కూల్స్‌లో మరుగుదొడ్ల వసతి సరిగాలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 100 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణ పనులకు గాను 24 స్కూల్స్‌లో పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 397 పనులు చేపట్టగా 163 పనులు పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టాగా 120 పనులను పూర్తి చేశారు.

పల్నాడు జిల్లాలో ...

పల్నాడు జిల్లాలో 1,281 స్కూల్స్‌లో ఆయా పనులు చేపట్టారు. రూ.312.03 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటికి రూ.152.19 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఐదు ప్రభుత్వం శాఖలకు పనులు అప్పగించారు. 1301 పాఠశాలల్లో 8,349 పనులు చేపట్టారు. వీటిలో 5,217 పనులు పురోగతిలో ఉన్నాయి. 3,127 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. స్కూల్స్‌లో 174 ప్యాకేజీల కింద 759 అదనపు తరగతి గదుల నిర్మాణం మంజూరు చేశారు. అయితే 25 మాత్రమే అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయినట్టు సంబంధిత శాఖల లెక్కలు తెలియజేస్తున్నాయి. పాఠశాలల విలీనంతో తరగతి గదులు చాలక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. గదుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 547 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌ను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టడం వంటి పనులను చేపట్టాలి. 139 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. అనేక స్కూల్స్‌లో మరుగుదొడ్ల వసతి సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 91 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణం చేపట్టగా 27 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 553 పనులు చేపట్టగా 216 పనులు పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 913 చేపట్టగా 265 పనులను మాత్రమే పూర్తి చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(శుక్రవారం)
సహారీ (ఉదయం) 4.54 (శనివారం)

రథాలు.. రెడీ

- ఎన్నికల ప్రచార రథాలకు కేరాఫ్ చిలకలూరిపేట

చిలకలూరిపేట, మార్చి 21: ఎన్నికల ప్రచార రథాలు.. అయితే చలో చిలకలూరిపేట! కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి ఎన్నికల ప్రచార రథాల కోసం అభ్యర్థుల అనుచరులు పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు తరలివస్తున్నారు. ఇక్కడ ఏ పార్టీకి చెందిన అభ్యర్థులకైనా ప్రచార రథాలను నాలుగైదు రోజుల్లో తయారుచేసి ఇస్తున్నారు. అభ్యర్థులకు నచ్చేరీతిలో వాహనాలకు పెయింటింగ్, స్టిక్కరింగ్ చేస్తున్నారు. దీనికి తోడు జనరేటర్, లైటింగ్, మైక్ సిస్టం కూడా వాహనానికి అమర్చి ఇస్తున్నారు. అభ్యర్థులు సులభంగా వాహనాలు ఎక్కేందుకు వీలుగా వెనుక వైపు మెట్లు తయారుచేసి మెట్లపై మ్యాట్ కూడా వేసి ఇస్తున్నారు. అభ్యర్థులు వారి వారి నియోజకవర్గాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా సులువుగా ప్రచారం చేసేందుకు వీలుగా ఈ రథాలను సిద్ధం చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థులకు ఇప్పటికే సుమారు 60 వాహనాలు ఇక్కడ సిద్ధం చేసి ఇచ్చారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సుమారు 35 వాహనాలు ఇక్కడే తయారుచేసి ఇచ్చారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా ప్రచార రథాల కోసం ఇక్కడికి బారులు తీరుతున్నారు. కేరళలో బీజేపీ తరఫున ఎన్నికల్లో పోటీ చేయబోతున్న కేంద్రమంత్రి వి.మురళీధరన్ ప్రచార రథాన్ని ఇప్పటికే ఇక్కడ సిద్ధం చేశారు. ఆ రథానికి మలయాళం భాషలో స్టిక్కరింగ్ చేశారు. నారా లోకేశ్ (తెలుగుదేశం), అవినాశ్‌రెడ్డి(వైసీపీ, కడప) లోకం మాధవి (జనసేన, నెల్లిమర్ల, విజయనగరం) మాగుంట (తెలుగుదేశం, ఒంగోలు) తదితరుల ప్రచారరథాలు ఇక్కడ సిద్ధమయ్యాయి.




ముస్తాబైన ఎన్నికల ప్రచార రథాలు





ఈ ప్రచార రథాల రూపకర్త చిలకలూరిపేటకు చెందిన షేక్ కరిముల్లా. ఆటోలు, మినీ వాహనాలకు బాడీ బిల్డింగ్ చేయడంలో, గ్రిల్స్ కట్టడంలో ఆయనకు 25 సంవత్సరాల అనుభవం ఉంది. చిలకలూరిపేటలోని జాతీయ రహదారిపై ఏఎంజీ పక్కన కరీముల్లా ఆర్క్ వెల్డింగ్ వర్క్స్ పేరుతో ఈ యువకుడు ఏర్పాటుచేసిన షెడ్డులో ఎన్నికల ప్రచార రథాలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా ప్రచార రథాల గురించి వివరిస్తూ కరీముల్లా ఇప్పటివరకు అన్ని పార్టీలకు సంబంధించిన సుమారు 100 ప్రచార రథాలను సిద్ధం చేసి ఇచ్చాము. ఇప్పుడు మా చేతిలో మరో 10 ప్రచార రథాలకు ఆర్డర్లు ఉన్నాయి. ఒక్కో ప్రచార రథాన్ని అన్ని రకాలుగా ముస్తాబు చేసి ఇవ్వడానికి సుమారు రు.4.5 లక్షలు ఖర్చు అవుతుంది. వాహనాలను మాత్రం అభ్యర్థులే తమకు నచ్చిన కంపెనీల నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. ముఖ్యంగా ఇసుజు, బొలెరో వాహనాలను అభ్యర్థులు తీసుకువస్తున్నారు."


షేక్ కరీముల్లా

వలంటీర్లపైనే కాదు.. నేతలపైనా చర్యలు తీసుకోవాలి

- ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి, కార్యకర్తలపై దాడి దుర్మార్గం
- దాడికి ఆధారాలు చూపుతున్నా పట్టించుకోని అధికారులు
- ఎస్పీ తుషార్‌డూడీకి టీడీపీ అభ్యర్థులు, నేతల ఫిర్యాదు

గుంటూరు, మార్చి 21: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న వలంటీర్లపైనే కాదు.. వారితో తమకు అనుకూలంగా పని చేయించుకుంటున్న నేతలపై కూడా చర్యలు తీసుకోవాలని టీడీపీ అభ్యర్థులు, జిల్లా నేతలు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, కార్యకర్తలపై జరిగిన దాడి కేసు నిందితులపై చర్యలు తీసుకోవాలని గురువారం ఎస్పీ తుషార్ డూడీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ శ్రేణుల దాడి ఆధారాలు చూపిస్తున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. రామాంజనేయులుపై దాడి జరిగితే ఆయన పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళితే ఆయనపై కేసు నమోదు చేయడం ఏమిటన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులను భయపెట్టేలా ప్రత్తిపాడు వైసీపీ నేతలు రామాంజనేయులుపై దాడి చేసినట్లు కనిపిస్తుందన్నారు. ప్రత్తిపాడు వైసీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ జన్మదిన వేడుకల్లో పోలీస్ అధికారులంతా హాజరై కేక్ కట్ చేశారని ఆ ఫొటోలను గుంటూరు లోక్‌సభ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాకు చూపారు. ఇటువంటి పోలీస్ అధికారులు ఉంటే దాడులు జరక్క ఏముంటుందని ప్రశ్నించారు. రామాంజనేయులు మాట్లాడుతూ బాలసాని ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో గడిచిన మూడు రోజులుగా వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఇంటింటికి వెళ్లి కులాలు, పార్టీల వారీగా ఓటర్ల వివరాలు సేకరించాలని రూ.5 వేలు చొప్పున తాయిలాలు ఇస్తున్నారన్నారు. ఈ విషయం తమకు తెలియడంతో అక్కడికి వెళ్లి వైసీపీ కార్యాలయానికి 150 మీటర్ల దూరంలో ఉండగానే 30 నుంచి 40 మంది వైసీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడికి దిగారన్నారు. తన కారుపై దాడికి పాల్పడి అద్దాలు పగలకొట్టే క్రమంలో వైసీపీ కార్యకర్త చిటికెన వేలుకు గాయమైతే తాము ఆయనపై దాడి చేసినట్లుగా కేసు నమోదు చేశారన్నారు. ఈ విషయమై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే అక్కడ కూడా తమపై దాడికి ప్రయత్నించారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, తాడికొండ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, జనసేన రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ రామాంజనేయులుపై దాడి జరిగి 24 గంటలు గడిచినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఎస్పీని కలిసిన వారిలో తూర్పు, పశ్చిమ టీడీపీ అభ్యర్థులు నసీర్‌అహ్మద్, పిడుగురాళ్ల మాధవి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు డేగల ప్రభాకర్, చిట్టాబత్తిన చిట్టిబాబు, రావిపాటి సాయికృష్ణ, కంచర్ల శివరామయ్య, గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు దర్శనపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ఆలపాటి, డా.పెమ్మసాని, శ్రావణ్, రామాంజనేయులు, నసీర్, నరేంద్ర, బోనబోయిన, గాదె తదితరులు

బ్యాంక్ లావాదేవీలపై నిఘా

గుంటూరు సిటీ, మార్చి 21: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా అనుమానాస్పద, అధిక మొత్తంలో జరిగే లావాదేవీల ఖాతాల వివరాలు ఎప్పటికప్పుడు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసే లోక్‌సభ అభ్యర్థి రూ.95 లక్షలు, శాసనసభ అభ్యర్థి రూ.40 లక్షల మేర వ్యయం చేసేందుకు అనుమతి ఉంటుందన్నారు. అయితే అంతకు మించి జరిగే వ్యయంపై పటిష్టమైన నిఘా ఉంటుందని, ఈ విషయంలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల బ్యాంకు ఖాతాల నుంచి జరిగే లావాదేవీలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. రూ.లక్షకు మించి ఉపసంహరణలు, డిపాజిట్ల లావాదేవీలు జరిగితే ఆ వివరాలను అందించాలన్నారు. బ్యాంకులు తరలించే నగదు వివరాలను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఈఎస్‌ఎంఎస్ యాప్‌లో నమోదు చేసుకుని క్యూఆర్ కోడ్‌తో రశీదు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఆదాయపు పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ లలితా, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎస్ జవహర్, ఎంసీసీ కమిటీ నోడల్ అధికారులు వీరాచారి, రఘు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉంది.. పోలీసుల తీరు మారాలి

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట, మార్చి21: ముగ్గురు ఎస్పీలకు ఎన్నికల సంఘం ప్రశ్నలతోనైనా జగన్ భక్త పోలీసుల తీరు మార్చుకుంటే మేలని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పట్టణంలోని తన నివాసగృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీలు స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఈసీ ఆదేశించటం తీవ్రతను ఇకనైనా వారు అర్థం చేసుకోవాలన్నారు. ఈసీ శ్రీముఖాలతోనైనా ప్రకాశం, పల్నాడు, నంద్యాల జిల్లాల ఎస్పీలు పరమేశ్వరరెడ్డి, రవి శంకర్‌రెడ్డి, రఘు వీరారెడ్డిలు వైసీపీ భక్తి మత్తు నుంచి బయట పడి విధి నిర్వహణ పై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కోడ్ వచ్చిన దగ్గర నుంచి జిల్లాలో ఎలాంటి అవాంఛ నీయ హింసాత్మక ఘటనలు జరిగినా ఎస్పీలనే బాధ్యులను చేస్తామని ఎన్నికల సంఘం ముందే ప్రకటించినా ఇప్పటికీ వైసీపీ అరాచకాలకు కొమ్ము కాస్తుండటమే దారుణమైన విషయం ఆయన అన్నారు. పల్నాడు వంటి అత్యంత సమస్యాత్మక ప్రాంతానికి ఎస్పీగా ఉన్న వ్యక్తి కూడా ఈ జాబితాలో ఉండటం మరింత ఆందోళన కలిగిస్తున్న విషయం అన్నారు. పోలీసులతో పాటు మిగిలిన అధికారులు కూడా కోడ్ అమల్లోకి వచ్చిన విషయాన్ని ఇక మీదటైనా గమనంలో పెట్టుకోకపోతే తరువాత వారంతా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాజకీయాల కార్యకలాపాల్లో జోక్యం చేసుకుంటున్న వాలంటీర్ వ్యవస్థపైనా మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు.





గ్రామంలో పంచాయతీ సరఫరా చేసిన ఆకుపచ్చ రంగులో నీళ్ల బాటిల్, పోలీసులకు నీటి సమస్యను వివరిస్తున్న స్థానికులు

కోడ్ ఉందంటూ నీటి సరఫరా నిలిపివేత

కాకుమాను, మార్చి 21: గ్రామంలోని ప్రజల నీటి సమస్య పరిష్కారం కోసం దాతలు నీటి ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తుంటే.. అనుమతి లేదని అధికారులు హెచ్చరించడంపై స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన మండల కేంద్రమైన కాకుమానులో గురువారం చోటు చేసుకుంది. గ్రామంలో వారం రోజుల నుంచి పంచాయతీ నీటి సరఫరా ఆపివేసింది. గ్రామంలోని ప్రజల తాగునీటి సమస్య తీవ్రత దృష్ట్యా దాతలు వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై అధికారులకు సమాచారం ఇవ్వడంతో ట్యాంకర్‌ను నిలిపివేసి నీటి సరఫరా కోసం అనుమతి ఉందా.. లేకుంటే కేసులు పెడతామని, అరెస్టులు చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, ఎంపీడీవో రామకృష్ణ కూడా పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న స్థానికులపై దురుసుగా ప్రవర్తించారు. మహిళలు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటే గ్రామంలో తాగునీరు సరఫరా చేయకూడదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ స్క్వాడ్ పోలీసులు పంచాయతీ కార్యాలయం నుంచి ప్రజలను బలవంతంగా పంపివేశారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతిపాలు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

● టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నాలక్ష్మీనారాయణ

● పెదకూరపాడు నియోజకవర్గ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 60 కుటుంబాలు..

అమరావతి, మార్చి 21: ఒక్క చాన్స్ ఇవ్వండంటూ కపట ప్రేమ ఒలకబోసి అధికారంలోకి వచ్చిన జగన్ మరోసారి అధికారం ఇస్తే మన ఆస్తులు కూడా దక్కవని మాజీమంత్రి సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం పెదకూరపాడు నియోజకవర్గం అమరావతి గ్రామంలో పల్నాడు జిల్లా కాపునాడు అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో 60 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారికి ఇరువురు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ వైసీపీ పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో 20 సంవత్సరాల వెనక్కిపోయిందని అన్నారు. బటన్ నొక్కుడు పేరుతో ప్రజలకు పది రూపాయలు ఇచ్చి వెయ్యి లాక్కుంటూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి సంయుక్త కృషితో గెలుపు సాధ్యం అవుతుందన్నారు. వైసీపీ పాలనపై విసుగుచెంది అధికార పార్టీ నుంచి ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సత్యనారాయణను పార్టీలో సముచిత స్థానం కల్పించి గౌరవించడం జరుగుతుందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు కన్నా లక్ష్మీనారాయణ, కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఆదరించారని అదే విధంగా నాపైన మీ ఆశీస్సులు ఉండాలని మనసారా కోరుకుంటున్నానన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు ఏమయ్యాయి?

● టీడీపీ పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



రెడ్డిపాలెం గ్రామస్థులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జీవీ

వినుకొండటౌన్, మార్చి 21: మండలంలోని బొల్లాపల్లి మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు అధికార వైసీపీని వీడి టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు సమక్షంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక జగన్‌రెడ్డి పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలగాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపరుస్తూ ప్రజలు టీడీపీలో చేరుతున్నారని అన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని, రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేశారన్నారు. ఎన్నికలకు ముందు ఏటా డీఎస్సీ ఇస్తానని జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రతి ఏడాది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను దగా చేశారని అన్నారు. నూతన ఇసుక పాలసీతో రాష్ట్రంలో ఇసుక కొరత సృష్టించి భవన నిర్మాణ కార్మిక రంగాన్ని నట్టేట ముంచి ఇసుక మాఫియాను ఏర్పాటు చేసుకొని జగన్‌రెడ్డి వందలకోట్లు దోచుకున్నారన్నారు. మద్యపాన నిషేదం చేస్తానని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి నాశిరకం మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని దుయ్యబట్టారు. సంక్షేమంటూ జగన్‌రెడ్డి ఒక చేత్తో వెయ్యి ఇస్తూ మరో చేత్తో పదివేలు వసూళ్ళు చేస్తున్నారని అన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికలకు ముందు ప్రజలకు అనేక హామీలు గుప్పించి మోసం చేశారని, గుండ్లకమ్మ నదిపై తంగిరాల డ్యామ్ నిర్మిస్తానని, ఎత్తిపోతల పథకాలు తెస్తానని, వరికపూడిశల ప్రాజెక్టు నిర్మించకపోతే నేను మీ ముఖం చూడనని, ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి వేయిస్తానని వాగ్దానం చేసి ప్రజలను దగా చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారిలో శౌరి బాబు, ఉల్లిగడ్డల బాజి, బాబు, ఆకాష్, మరియబాబు, జక్క నాగరాజు, చేవూరి నాగరాజు, పెద్ద మరియన్న ఉన్నారు. జరపాల గోవిందు, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అశ్రునయనాలతో గుంటుపల్లి అంతిమయాత్ర

● పాల్గొన్న టీడీపీ ఉమ్మడి జిల్లా నేతలు

● పాడె మోసిన యరపతినేని, కొల్లు రవీంద్ర, చదలవాడ



నివాళులర్పిస్తున్న నక్కా ఆనందబాబు, కొల్లు రవీంద్ర, యరపతినేని

దాచేపల్లి,మార్చి 21: టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు, నవ్యాంధ్రప్రదేశ్‌లో ఒకసారి రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్‌గా పనిచేసి అనారోగ్యంతో మృతి చెందిన గుంటుపల్లి నాగేశ్వరరావు అంతిమ యాత్రలో టీడీపీకి చెందిన మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీలో రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు పాల్గొన్నారు. గురువారం దాచేపల్లిలోని బీసీ కాలనీలో గుంటుపల్లి నివాసం నుంచి శ్మశాన వాటిక వరకు భారీ అంతిమయాత్ర నిర్వహించారు. గుంటుపల్లికి అంతిమసంస్కారం జరుగుతుండగా బీసీలకుచెందిన మంచి నాయకుడిని పార్టీ కోల్పోయిందని, తనకు చేదోడువాదోడుగా వుంటూ పార్టీ కార్యక్రమాలలో చురుగ్గాపాల్గొన్న గుంటుపల్లి ఆకస్మిక మరణం తననెంతగానో బాధించిందని యరపతినేని కన్నీటిపర్యంతమ య్యారు. గుంటుపల్లి పాడెను మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర, మాజీమంత్రి నక్కా ఆనంద బాబు, పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా, నరస రావుపేట ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతుల మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పెదకూరపాడు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్, కోడెలశివరాం తదితరులు పాల్గొని మోశారు. దాచేపల్లిలోని పురవీధులలో గుంటుపల్లి అంతిమయాత్రసాగగా, పార్టీలతో సంబంధం లేకుండా అన్నివర్గాల నేతలు గుంటుపల్లి నాగేశ్వరరావు భౌతిక దేహానికి నివాళులర్పించారు.



గుంటుపల్లి పాడె మోస్తున్న యరపతినేని, అరవిందబాబు



నిధులు మంజూరు కాకపోయినా సీసీ రోడ్డుకు కీవాల్స్ వేసిన వైసీపీ నేతలు

ఓట్లేయండి.. రోడ్డేస్తాం..

● ఓటర్లను ప్రభావితం చేసేందుకే వైసీపీ నేతల యత్నం

రేపల్లె, మార్చి 21: నిజాంపట్నం మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో అధికార పార్టీ నాయకులు ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా సీసీ రోడ్ల నిర్మాణం కోసం గుట్టుచప్పుడు లేకుండా తెల్లారేసరికి కీవాల్స్ వేశారు. వైసీపీకి చెందిన కీలక నేత మీ ఊరికి రహదారి వేస్తాం మీ ఓట్లన్నీ మాకు వెయ్యాలంటూ గత రెండు రోజుల క్రిందట ఆ గ్రామ ప్రజలకు హామీనిచ్చారు. అయితే కొంతమంది గ్రామస్తులు.. పంచాయతీ రాజ్ అధికారుల అనుమతి లేకుండా సీసీ రోడ్లు ఎలా వేస్తారంటూ నిలదీశారు. దీనిపై పంచాయతీ రాజ్ అధికారుల వివరణ కోరగా తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

పోలింగ్ బూతలలో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు..

● ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజ్ఞప్తి

గుంటూరు సిటీ, మార్చి 21: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలో ఉన్న మహిళలు (గర్భిణులు, బాలింతలు) కోసం పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె గురువారం ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్ కమిషన్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలకు వేరుగా క్యూలైన్ లు ఏర్పాటు చేయాలని లేఖలో పేర్కొన్నారు. కొన్ని అత్యవసర సందర్భాల్లో మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు, తదితర విషయాల్లో వారికి తగు న్యాయం చేయడం కోసం బాధితులను పరామర్శించడానికి మహిళా కమిషన్ చైర్‌పర్సన్, మెంబర్లకు ఎన్నికల నిబంధనలలో సడలింపు ఇవ్వవలసినదిగా గజ్జల వెంకట లక్ష్మీ కోరారు.

విద్యుత్ బకాయి వసూళ్లపై దృష్టిసారించండి

● అధికారులకు సీపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆదేశం

గుంటూరు, మార్చి 21: గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్‌లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని, వసూళ్లపై సీరియస్‌గా దృష్టి సారించాలి అని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ కే.సంతోషరావు అధికారులకు సూచించారు. గుంటూరు విద్యుత్‌భవన్‌లోని సమావేశ హాల్లో గురువారం గుంటూరు, సీఆర్‌డిఏ సర్కిల్స్ డివిజన్, సబ్ డివిజనల్ అధికారులతో సీఎండీ సమీక్షా నిర్వహించారు. వినియోగదారులకు విద్యుత్ సేవలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, లేని పక్షంలో సంబంధిత అధికారులు తిరిగి వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొత్త సర్వీసుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పీక్ అవర్స్‌లో లోడ్ బ్యాలెన్స్ చేసుకోవాలని, అంతరాయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. వేసవిలో లోడ్‌ను దృష్టిలో పెట్టుకొని ట్రాన్స్‌ఫార్మర్స్‌ను అవసరానికి అనుగుణంగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డివిజన్ వారీగా పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా రెవెన్యూ వివరాలను సీఎండీ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీపీడీసీఎల్ డైరక్టర్స్ బీ.జయ భారతరావు(టెక్నికల్), టీ.వనజా(ప్రాజక్ట్స్), సీజీఎంలు ఏ.రామ్‌దాస్, కేఎస్.పరబ్రహ్మం, ఆపరేషన్ సర్కిల్స్ ఎస్ఈలు ఆవుల మురళీకృష్ణ యాదవ్(గుంటూరు), ప్రత్తిపాటి విజయ్‌కుమార్(సీఆర్‌డిఏ), ఎనర్జీ ఆడిట్ విజయకృష్ణ, డివిజనల్ అధికారులు, ఏడీఈలు పాల్గొన్నారు.

అరుణాచలంనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, మార్చి 21: ఈనెల 25న పౌర్ణమికి అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తులకోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 23న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 24వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదేరోజు రాత్రి అక్కడే బసచేసి 25న పౌర్ణమిన అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదేరోజుసాయంత్రం బయల్దేరి 26న ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్ రిజర్వేషన్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోఛార్జీ రూ. 2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 సంప్రదించాలని కోరారు.

అట్రాసిటీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి



పెమ్మసానికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ ధర్మారావు

తెనాలి రూరల్, మార్చి 21: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును వైసీపీ ప్రభుత్వం నీరుగారుస్తుందని, అట్రాసిటీ కేసు నమోదుచేసిన వెంటనే స్టేషన్ బెయిల్‌పై నిందితులను విడుదలచేస్తూ తమకు రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. గురువారం మండలంలోని హాఫ్‌పేటలో ఎన్నికలప్రచారంలో భాగంగా పర్యటిస్తున్న గుంటూరు పార్లమెంటరీ నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్‌ను, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌ను, తెనాలి టీడీపీ ఇన్‌చార్జి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసిన ధర్మారావు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్‌ను అమలు చేయాలని, ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేలా కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకునేందుకు తమవంతు కృషి చేస్తామని ధర్మారావు మాదిగ వారికి తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1,04,332 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,06,381 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,04,332 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 81,360 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	9000	15000
273	12000	19000
341	9000	18500
4884	11500	13500
సూపర్ 10	11500	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22000
బ్యాడిగి	9500	19500
దేవనూరు డీలక్స్	9000	20000
తెల్లకాయలు	5000	12500



స్థానిక నేతలు, గ్రామస్థులతో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు

నదుల అనుసంధానంతో పల్నాడు సుభిక్షం

● టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు

కారంపూడి, మార్చి 21: కృష్ణ, గోదావరి, పెన్నా నదుల అనుసంధానమే తన లక్ష్యమని, నదుల అనుసంధానం జరిగితేనే తాగునీటి ఇబ్బందులు లేకుండా పల్నాడు ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని టీడీపీ, జనసేన, బీజేపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం కారంపూడిలో ఆయన పర్యటించి నేతలు, కార్యకర్తలు, ప్రజలతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2022లోనే పార్లమెంట్ సమావేశంలో దీనిపై బడ్జెట్ కేటాయించిందని, పనులు మాత్రం ప్రారంభం కాలేదని చెప్పారు. రానున్న ఐదేళ్లలో నదుల అనుసంధానంకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. ఇందుకోసం నిధులు మంజూరు చేయించామని, ప్రాజెక్ట్ ప్రారంభానికి నోచుకోలేదని చెప్పారు. ఇది పూర్తయితే మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి సమస్య ఉండదన్నారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘ నేతలతో సమావేశమయ్యారు. ఎస్సీ కాలనీలో పర్యటించి కాలనీ అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఆయన వెంట తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ జాస్తి గంగారావు, కొంగర లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఉన్నం శ్రీను, ఉప ఎంపీపీలు పంగులూరి పుల్లయ్య, చావా వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జాని, తెలుగు యువత మండల అధ్యక్షుడు చిన రత్తయ్య, బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, దోర్నాల బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి, నాగవరపు రాముడు, జనసేన మండల అధ్యక్షుడు కేసనపల్లి కృష్ణబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పువ్వాడ శ్రీనివాస్, కర్ల అమరసైదయ్య తదితరులు ఉన్నారు.



సమావేశానికి హాజరైన సమన్వయ కమిటీ సభ్యులతో డాక్టర్ బీ.లక్ష్మి

పరిశోధనలతో రైతులకు మేలు

● వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ బీ.లక్ష్మి

బాపట్ల, మార్చి21: ఏరువాక కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు సమన్వయ కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగకరమని లాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ బీ.లక్ష్మి తెలిపారు. బాపట్ల ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. బాపట్ల ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బాలమురళీధర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరిశోధన అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అందువలనే కొత్తరకాలు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నాయని రైతులు ముందస్తు ప్రణాళికతో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం రైతులు, శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణా విభాగాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ ఎంసీ ఓబయ్య, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.వి.రమణ, డీఆర్‌సీ డీటీసీ డాక్టర్ ఎం.విజయనిర్మల, బాపట్ల పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.హనుమంతరావు, మత్స్యశాఖ జేడీ డాక్టర్ పి.సురేష్, జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ టి.రత్నకుమారి, బాపట్లలోని వ్యవసాయ కేంద్రాల వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరై అపరాల సేద్యం, సేంద్రియ వ్యవసాయం, కలుపునివారణ మందుల వాడకం, వివిధ ఆధునిక వ్యవసాయ పనిముట్ల వాడకం వంటి విషయాలపై సూచనలు, సలహాలిచ్చారు.

వైసీపీకి మదమంచి రాజీనామా

సత్తెనపల్లి, మార్చి 21: పార్టీ కోసం మూడున్నర ఎకరాలు పొలం అమ్ముకున్నా వైసీపీలో సరైన ప్రాధాన్యం లేక పోవటంతో ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు వైసీపీ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల పార్టీ మాజీ కన్వీనర్ మందమంచి రాంబాబు తెలిపారు. గురువారం సత్తెనపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఏర్పాటు చేసినప్పటి నుంచి పార్టీ కోసం ఎంతో త్యాగం చేసినట్టు ఆయన తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ స్థానిక నాయకత్వం సరైన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు పార్టీలో కొనసాగానన్నారు. పదవివున్నప్పటికీ సామాన్య కార్యకర్తగానే కొనసాగానన్నారు. గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ పదవులను వైసీపీ తరఫున ఏకగ్రీవంగా గెలిపించుకున్నప్పటికీ స్థానిక నాయకత్వం గ్రామాభివృద్ధికి ఎటువంటి సహకారం అందించ లేదన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన తాను కట్టావారిపాలెం సర్పంచ్ అయిన మదమంచి పార్వతి కుమారి, గ్రామ ఎంపీటీసీ, తన సోదరి దేవినేని అనురాధలు కూడా పార్టీకి రాజీనామా చేసినట్టు మందమంచి రాంబాబు తెలిపారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

మా ఊపిరి అమరావతి

● 1556వ రోజుకు రైతుల ఆందోళన

తుళ్ళూరు, మార్చి 21: అమరావతిని కాదని రాష్ట్రాభివృద్ధిని సీఎం జగన్‌రెడ్డి అడ్డుకున్నాడని 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1556వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతి తమ ఊపిరి అని పేర్కొన్నారు. మూడు రాజధానులని అమరావతి నిర్వీర్యం చేసి, అభివృద్ధి లేకుండా వినాశనం చేశారన్నారు. ప్రాంతాల మధ్య తారతమ్యం తీసుకొచ్చి మూడు ముక్కల ఆటతో రాష్ట్రాభివృద్ధి లేకుండా చేశారన్నారు. పరిశ్రమలు పారిపోయేటట్టు చేసి ఉద్యోగావకాశాలు లేకుండా నిరుద్యోగం పెంచాడన్నారన్నారు. ఎడారి శ్మశానం, అడవి అంటూ అమరావతిపై అభాండాలు వేయటం దుర్మార్గమన్నారు. సీఎం జగన్‌రెడ్డి పదవి నుంచి దిగిపోయే ముందు అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. అమరావతివెలుగు కార్యక్రమం కొనసాగింది, రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

రెవెన్యూ వసూళ్ల లక్ష్యం 33 కోట్లు..

● ఈ నెల 28 నాటికి పూర్తిచేయాలి..

● రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు, అధికారులకు జీఎంసీ ఏసీ ఆదేశం

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 21 : నగర పాలక సంస్థ రెవెన్యూ వసూళ్ల లక్ష్యం రూ.33 కోట్లు ఈ నెల 28 నాటికి పూర్తి చేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులకు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కే.రాజ్యలక్ష్మి సూచించారు. జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం కమిషనర్ ఛాంబర్‌లో రెవెన్యూ వసూళ్ళ వేగవంతంపై డిప్యూటీ కమిషనర్లతో కలసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా 21వ తేది వరకు అయిన వసూళ్ళ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా జీఎంసీ ప్రైవేటు డిమాండ్ ద్వారా రూ.63 కోట్లు వసూలు చేయాల్సిన ఉందని, ఆర్.ఐలు వసూళ్లను వేగవంతం చేయాలని, ఇన్‌స్పెక్టర్ల వారీగా రూ. 33 కోట్లు లక్ష్యం విధించారు. ప్రతి ఒక్కరూ ఈ లక్ష్యానికి అనుగుణంగా ఈ నెల 28 నాటికి వసూళ్లను పూర్తి చేయాలన్నారు. పెద్ద మొత్తంలో ఉన్న బకాయిదారుల పన్ను వసూళ్ళకు ఆర్‌ఐలతో పాటు డిప్యూటీ కమిషనర్లు పాల్గొని లక్ష్యాలను అధిగామించాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం రెవెన్యూ వసూళ్ళపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. నగర పాలక సంస్థకు బకాయిలు ఉన్న ఖాళీ స్థలం పన్ను బకాయిలు ఉన్న గృహ యజమానులకు అవగాహన కలిగించి, ఖాళీ స్థలం పన్ను వసూళ్లు నూరుశాతం జరిగేలా చూడాలన్నారు. ప్లానింగ్ సెక్రటరీలు ఖాళీ స్థలం పన్ను వసూళ్ల వేగావంతానికి సహకరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమీషనర్లు చెరువు శ్రీనివాస్, వెంకట కృష్ణయ్య, రెవిన్యూ అధికారులు బాలాజీ బాష, సాంబశివరావు, రెహమాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనలో భాగస్వాములమౌదాం

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ పిలుపు

● మార్చి 24న వరల్డ్ టీబీ డే సందర్భంగా ప్రత్యేక కార్యాచరణ

గుంటూరు (మెడికల్) మార్చి 21: దేశంలో 2025 నాటికి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు జరుగుతున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులుతో కలసి ఆమె మాట్లాడారు. మార్చి 24న వరల్డ్ టీబీ డేగా జరుపుకుంటున్నట్లు డాక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. జిల్లాలో మొత్తం అరు టీబీ కంట్రోల్ యూనిట్ల ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు స్క్రీనింగ్, వైద్యసేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. మన దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య సమస్యలలో క్షయ వ్యాధి ఒకటన్నారు. గతంతో పోలిస్తే ఐదు సంవత్సరాల నుండి టీబీ కేసులు గణనీయంగా తగ్గుతూ వస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం టీబీ నిర్ధారణ కొరకు చేసే పరీక్షలు సిబినాట్, ట్రునాట్ వివిధ రకాల స్కానింగ్స్ పరీక్షలు అందుబాటులో రావటంతో సులభముగా క్షయను గుర్తిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ వివరించారు. జిల్లా టిబి నివారణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ మార్చి 24 ఆదివారం నాడు జరగబోతున్న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జరగబోయే ర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఆరోగ్య ఆసరా నగదు అందేలా చర్యలు

● జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ

● ఆసరాపై వైద్యాధికారులకు, సిబ్బందికి శిక్షణ

గుంటూరు (మెడికల్) మార్చి 21: ఆరోగ్య కేంద్రాలలో అయిన కాన్పులు అన్నింటికీ ఆరోగ్య ఆసరా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ ఆదేశించారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో ఆరోగ్య ఆసరాపై వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె ప్రసంగించారు. అరు లైన బాలింతల డాక్యుమెంటు అప్లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు. అదేవిధంగా లబ్ధిదారుల ఆధార్ కార్డు బ్యాంక్ ఎకౌంట్‌కు లింక్ అయి ఉండాలని డాక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి లక్ష్మీ కుమారి, అకౌంట్ ఆఫీసర్ కృష్ణకుమారి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆరినేటర్ డాక్టర్ విజయ ప్రకాష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌సీ సెల్ నేతలు

రామాంజనేయులుపై దాడి దుర్మార్గం

● టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొడూరి అఖిల్

గుంటూరు,మార్చి21(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడటం దుర్మార్గమని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి అఖిల్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఎస్సీ సెల్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యావంతుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి, టీడీపీ ప్రత్తిపాడు అభ్యర్థి రామాంజనేయులు గెలుపు ఖాయమని తెలిసిన వైసీపీ అభ్యర్థి కిరణ్‌కుమార్ సచివాలయ ఉద్యోగులను, వలం టీర్లను అడ్డుపెట్టుకుని ఎలాగైనా గెలవాలనుకోవడం సిగ్గుచేటన్నారు. బొల్లెద్దుల సుశీలరావు మాట్లాడుతూ కిరణ్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించాడని, అతనిపై ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు దయారత్నం, వెంకటరావు, డీ.రమణ, ఆదాము, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు ..

● జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాల నిర్వహణ

● సీఎం జగన్ ఫొటో ముద్రించివున్న సంచులు, కేస్‌షీట్‌లు, ఫైల్స్ రోగులకు పంపిణీ

● పట్టించుకోని ఎన్నికల అధికారులు

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు ఆగడం లేదు. సచివాలయాల్లో విధులు నిర్వహించే ఏఎన్‌ఎంలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న ప్రస్తుత తరుణంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించడమే ఒక తప్పు. పైగా ఆయా శిబిరాల్లో సీఎం జగన్ ఫోటో ముద్రించి ఉన్న సంచులు, కేస్ షీట్‌లు, ఫైళ్లు రోగులకు పంపిణీ చేస్తున్నారు. తాజాగా గురువారం నగరంలో పలుచోట్ల ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం తీరుపై సీరియస్‌గా ఉన్న ఎన్నికల సంఘం తాజా ఉల్లంఘనలతో ఏమి నిర్ణయం తీసుకొంటుందోనన్న ఉత్కంఠ నెలకొన్నది.

నగరంలోని క్రిస్టియన్ పేట, ఎన్‌టీఆర్ నగర్, చౌత్రా, ఎన్‌జీవో కాలనీ, భారతపేటలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించి అక్కడ వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులకు జగన్ ఫోటో ఉన్న సంచులను సిబ్బంది పంపిణీచేశారు. ఈ నెల 20న ఆంధ్రజ్యోతి సంచికలో ఆరోగ్య సురక్ష శిబిరాలతో వైసీపీ ప్రచారం అన్న శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీంతోనైనా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకొంటారనుకొంటే వారు అందుకు విరుద్ధంగా నిర్లిప్తంగా వ్యవహరించారు. వైద్య శిబిరాలు జరుగుతున్న ప్రదేశాలకు తెలుగుదేశం పార్టీ నాయకులు వెళ్లి ఫోటోలు తీసి ఎన్నికల సంఘానికి సీవిజిల్ యాప్ ద్వారా పంపించారు.



ఆరోగ్య సురక్ష శిబిరాల వద్ద జగన్ ఫోటో ఉన్న సంచుల పంపిణీ

మరోవైపు జగనన్నకాలనీలు నిర్మించిన అన్ని చోట్ల ముఖద్వారాలను ఏర్పాటు చేశారు. వాటికి కూడా వైసీపీ రంగులు అద్దారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ వాటికి సున్నం వేయించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. సీఈవో ఉన్న జిల్లాలోనే ఈ పరిస్థితి కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది.



ఏటుకూరు జగనన్న కాలనీ ముఖద్వారానికి వైసీపీ రంగులు

చిలకలూరిపేట ఎన్నికల ప్రచారంలో కార్పొరేషన్ ఉద్యోగి

మేయర్ పీఏ నాగకుమార్, మరికొందరు ఉద్యోగులు అదే బాటలో..

గుంటూరు (కార్పొరేషన్): నగరపాలక సంస్థలో ఆప్కాబ్‌లో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారు. మరికొందరు ఉద్యోగులు బరితెగించి ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. గుంటూరు మేయర్ మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్లు షేక్ సజీల, డైమండ్‌బాబుల వద్ద కొందరు కార్పొరేషన్‌కు చెందిన ఆప్కాబ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈనెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే వీరిని అక్కడ విధుల నుంచి తప్పించినప్పటి నుంచి వారు వైసీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు ఎన్నికల ప్రచారంలో జీఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి పీఏనాగకుమార్, మరో డ్రైవర్ ఇద్దరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రతిరోజు మేయర్‌తో పాటు తిరుగుతూ ఆయనకు సంబంధించిన ఫొటోలు తీసి మీడియా, ప్రసార మాధ్యాల్లో పెడుతున్నారు. ఎన్నికల నియమావళికి పూర్తి విరుద్ధంగా పీఏ నాగకుమార్, మరికొందరు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. అయినా వారిపై ఎటువంటి చర్యలు లేవు. దీంతో పలువురు సైతం ఆయా ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల కోడ్ నగరపాలకసంస్థలో అమలు కావటం లేదనటానికి వీరి వ్యవహార శైలి నిదర్శనంగా ఉంది.

పసుపు రైతులకు న్యాయం చేయాలి

● డీఆర్వో కార్యాలయ ఏవోకి సీపీఐ నేతల వినతి

గుంటూరు (తూర్పు), మార్చి 21: దుగ్గిరాల, కోల్డ్‌స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో పంట కోల్పోయిన పసుపు రైతులకు పూర్తి న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్వో కార్యాలయ పరిపాలన అధికారికి ఆ ప్రాంత పసుపు రైతులు, రైతు సంఘ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం జంగాల మాట్లాడుతూ ఘటన జరిగి దాదాపు రెండు నెలలు దాటినప్పటికి విచారణలో ఎటువంటి పురోగతి లేదని వాపోయారు. పైగా విచారణ పూర్తయ్యేవరకు ఇతర వ్యాపారాలు చేయవద్దని కలెక్టర్ ఆదేశించినా, కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం మాత్రం యథేచ్ఛగా వ్యాపారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఆ యాజమానిపై చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రమాద ఘటనపై విచారణను వేగంగా పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, విఠల్‌రెడ్డి, సీపీఐ నేతలు పలువురు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

ఘనంగా గజలక్ష్మి అమ్మవారి కల్యాణం

గుంటూరు(తూర్పు), మార్చి 21: స్థానిక అరండల్‌పేట అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణస్వామి ఆలయ 29వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గజలక్ష్మి, నారాయణుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, అలంకరణ, కుంకుమ పూజలు జరిగాయి. శ్రీచక్ర అభిషేకం, లలితా సహస్రనామ పారాయణం, వేదపండితుల ఆధ్వర్యంలో గజలక్ష్మి, నారాయణుల ఉత్సవమూర్తులకు దంపతులచే కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ నిర్వాహకులు ఎం.ప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



నసీర్‌కు మద్దతు తెలుపుతున్న ముస్లిం దూదేకుల సంఘ నేతలు

నసీర్‌కు దూదేకుల సంఘ నేతల మద్దతు

గుంటూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి మెహమ్మద్‌నసీర్‌కు దూదేకుల సంఘ నేతలు మద్దతు ప్రకటించారు. నూర్‌బాషా సంఘ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్, టీడీపీ మైనార్టీ విభాగ అధికార ప్రతినిధి హుస్సేన్ గురువారం టీడీపీ గుంటూరు తూర్పు కార్యాలయంలో నసీర్‌ను కలిసి మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వంలో దూదేకులకు అందిన సంక్షేమ పథకాలను, అనంతరం వైసీపీ ప్రభుత్వంలో జగన్ చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారికి సూచించారు. కార్యక్రమంలో నాగూర్, ఆదాం షపీ, ఖాసీం వలి, సలాం, నబి, మీరా వలి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు

● గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలకు మొదటి బహుమతి

గుంటూరు(విద్య),మార్చి 21: స్థానిక టీజేపీఎస్ కళాశాల గణిత శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో గురువారం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ అంతర కళాశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, కార్యదర్శి కేవీ.బ్రహ్మం, హిందూ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బీ.రామిరెడ్డి హాజరయ్యారు. రామిరెడ్డి మాట్లాడుతూ.. మానవుని నిత్యజీవితంలో గణితం చాలా ప్రాముఖ్యమైందన్నారు. క్విజ్ పోటీల ద్వారా ఆలోచనా శక్తి, రీజనింగ్, కరెంట్ అఫైర్స్, మెంటల్ ఎబిలిటీ, జనరల్‌నాలెడ్జి వంటివి అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ పోటీల్లో గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల మొదటి బహుమతి (రూ.2000), హిందూ కళాశాల ద్వితీయ బహుమతి (రూ.1500) కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో కే.కవిత, ఆర్.స్వామి, డాక్టర్. జేవీ. సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్

దరఖాస్తు గడువు నేటితో పూర్తి

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్మీలో ఖాళీల భర్తీకి వెలువడిన నోటిఫికేషన్‌కు సంబంధించి ఈనెల 22వ తేదీ శుక్రవారంతో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ముగుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన, అర్హత ఉన్న అభ్యర్థులు జాయిన్‌ఇండియన్‌ఆర్మీ.ఎన్‌ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

23 నుంచి కల్యాణోత్సవం

గుంటూరు(తూర్పు), మార్చి21: స్థానిక పాతగుంటూరు సుద్దపల్లి డొంక లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వాముల 26వ కల్యాణ బ్రహ్మోత్సవములు ఈ నెల 23 నుండి 25 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తలారి రాము తెలిపారు. గురువారం ఆలయప్రాంగణంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 23న గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, మల్లిఖార్జునస్వామికి రుద్రాభిషేకం, 24న పంచముఖ ఆంజనేయస్వామికి మన్యసుక్తపారాయణం అభిషేకం, రాత్రికి లక్ష్మీతిరుతమ్మ, గోపయ్య స్వాముల కల్యాణోత్సవం, 25న రథోత్సవం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పొదిలి మహేష్, కుర్రా పున్నారావు, దానబోయిన కోటేశ్వరరావు, బిచ్చాల కృష్ణ, వెంకటేశ్వరరావు (గోపాలకృష్ణ), శ్రీనివాసరావు పాల్గొని కల్యాణోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

విజ్ఞాన్స్ వర్సిటీ, ఎలైట్ స్పోర్ట్స్‌ల ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఎంఎస్ రఘునాథన్, మోహిత్‌సింగ్

గుంటూరు(విద్య), మార్చి 22: స్థానిక చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, ఢిల్లీలోని ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్‌తో అవగాహన పత్రాలను మార్చుకున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన జాతీయ స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు యూనివర్సిటీ అథ్లెట్లకు ఒక ప్రత్యేక వేదికను కల్పిస్తుందన్నారు. ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ.ఆదిలక్ష్మీ, ఎం.కళాధర్

గుంటూరు(విద్య),మార్చి 21: విద్య ప్రైవేటుపరం కావటం సమాజ పతనానికి దారితీస్తుందని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బీ.ఆదిలక్ష్మీ, ఎం.కళాధర్‌లు తెలిపారు. యూటీఎఫ్ తొలి ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 24వ వర్ధంతి సందర్భంగా బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు ప్రత్యేక సమావేశంలో నిర్వహించారు. ఏడాదికి ఏడాది ప్రైవేటు విద్యారంగం పెరిగిపోవడం వల్ల ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతుందన్నారు. రానున్న సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి వెంకటేశ్వర్లు, ఎఎల్ శివపార్వతి, జి వెంకటేశ్వర్లు, ఎం గోవిందయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు కోటిరెడ్డి, కె ప్రేమ్‌కుమార్, ఎం ధనరాజారావు,కె రంగారావు తదితరులు పాల్గొన్నారు. తొలుత అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు.



అప్పారి వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



శ్యామలానగర్ రైల్వేగేటు వద్ద మరమ్మతులు నిర్వహిస్తున్న రైల్వే శాఖ సిబ్బంది

శ్యామలనగర్ రైల్వేగేటు మూసివేత

● అత్యవసర మరమ్మతుల నిమిత్తం రైల్వే శాఖ నిర్ణయం

● 25వ తేదీ వరకు ప్రజలకు తప్పని తిప్పలు

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లెవల్ క్రాసింగ్ నెంబరు. 312 (శ్యామలనగర్) గేటుని రైల్వే శాఖ గురువారం మూసివేసింది. అత్యవసర మరమ్మతులు నిమిత్తం 25వ తేదీవరకు ఆయా గేటుని మూసివేస్తున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. ఈ నెల 25వ తేదీ రాత్రి 7 గంటల వరకు ఈ గేటు మూసి ఉంటుందని రైల్వేవర్గాలు తెలిపాయి. దీని దృష్ట్యా రోడ్డు వినియోగదారులు కంకరగుంట ఆర్‌వోబీ లేదా ఆర్‌యూబీ ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలని డీఆర్‌ఎం రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. శ్యామలానగర్ సమీప కాలనీల ప్రజలు, చుట్టు పక్కల గ్రామాలవారు, హైదరాబాద్ రహదారి నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు, ప్రజలు ఈ రైల్వేగేటు ద్వారానే ప్రవేశిస్తుంటారు. ముఖ్యంగా ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతుండటంతో గేటు మూసివేయటంతో విద్యార్థులు అదనంగా కిలోమీటరుకి పైగా ప్రయాణించి కంకరగుంట ఆర్‌వోబీ లేదా ఆర్‌యూబీ మీదగా వెళ్లాల్సి వస్తుంది. దీంతో అక్కడ రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కాగా పట్టాభిపురం రైల్వేగేటు మూసి ఉన్నప్పటికీ చాలామంది పాదచారులు, సైకిలిస్టులు ప్రమాదకర రీతిలో గేటు దాటుతు న్నారు. గేటు మూసివేసి ఉంచినప్పటికీ అక్కడ పర్యవేక్షించేవారు లేకపోవ డంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు.



ప్రమాదభరితంగా పట్టాలు దాటుతున్న విద్యార్థినులు



విద్యార్థిని వద్ద ట్యాబ్ పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాశ్ తదితరులు

పాఠశాలల్లో సాంకేతిక విద్యా బోధనపై

ద్విసభ్య కేంద్ర బృందం పరిశీలన

గుంటూరు(విద్య),మార్చి 21: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సాంకేతిక విద్యాబోధనకు "ప్రైమ్ మినిస్టర్ ఎక్సలెన్స్" అవార్డుకు ఆంధ్రప్రదేశ్ ఎంపికైంది. అవార్డు ప్రదానం చేసే ముందుగా ఇద్దరు అధికారులతో కూడిన కేంద్ర బృందం గురువారం జిల్లాలోని పాఠశాలల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో బోధన తీరు, తెన్నులను పరిశీలించేందుకు కేంద్ర డిప్యూటీ కార్యదర్శులు ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ గురువారం గుంటూరు జిల్లాలోని పెదకాకాని మండలం వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్, గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పట్టాభిపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ), బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల ద్వారా జరుగుతున్న బోధనను కేంద్ర అధికారులు పరిశీలించారు. ఇంజినీరింగ్ విద్యార్థులను పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ప్రవేశనపెట్టిన "ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్" కార్యక్రమాన్ని పరిశీలించిన అధికారులు విద్యార్థులతో మాట్లాడి. సంతృప్తి వ్యక్తం చేశారు. ట్యాబ్‌ల వినియోగంపై 8,9 తరగతుల విద్యార్థులతో మాట్లాడిన ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్ వారిలోని మేధస్సు, సబ్జెక్టుల వారీగా పట్టు, ఇంగ్లిష భాషలో పరిజ్ఞానాన్ని పరిశీలించారు. కేంద్ర బృందంతోపాటు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి, ఆర్జేడీ బీ.లింగేశ్వరరెడ్డి, డీఈవో పి.శైలజ, సీఎస్ఈ ఐటీ సెల్ ప్రతినిధి రమేష్, హెచ్‌ఎంలు ఉన్నారు.



కన్నా సమక్షంలో టీడీపీలో చేరుతున్న జనసేన నాయకులు

కన్నా సమక్షంలో టీడీపీలోకి జనసేన నేతలు

గుంటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో పలువురు జనసేన పార్టీ నాయకులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. గురువారం ఉదయం కన్నావారితోటలోని లక్ష్మీనారాయణ నివాసానికి జనసేన 22వ డివిజన్ నాయకుడు రామిశెట్టి శ్రీనివాసరావు నేతృత్వంలో పలువురు కార్యకర్తలు వచ్చి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని కన్నా సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు ఎస్‌ఎం సుభాని, షేక్ జానీ, బద్రిశెట్టి రాంబాబు, పాశం విమల్, బత్తుల అంజి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ నాగూర్, మునగాల రవీంద్రనాథ్, షేక్ గౌస్, నైజాంబాబు, ఒంగోలు శ్రీను, పగడాల రామకృష్ణ, మేకల మాధవ్, షేక్ కాజావలి, జిలాని పాల్గొన్నారు.

జేకేసీలో నేడు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌స్కిల్ పోటీలు

గుంటూరు(విద్య),మార్చి 21: స్థానిక జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి (జేకేసీ) కళాశాలలో నేడు ఆంగ్లవిభాగం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌స్కిల్ పోటీలు నిర్వహిస్తు న్నట్లు ఆంగ్ల విభాం అధ్యక్షులు పీ.గోపీచంద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, ఆంగ్లసామెతలపై అవగాహన, మృదునైపుణ్యా పెంపుకోసం ఈపోటీలు నిర్వహిస్తు న్నామని వివరించారు. ముఖాభినయం ద్వారా ఇచ్చిన సామెతలను కనిపెట్టే (డబ్‌షరేడ్స్ ప్రోవెర్బ్స్)ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమౌతుందని తెలిపారు. డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు ఒక్క టీములో ఇద్దరు విద్యార్థులు చొప్పున ఒక్కో కళాశాల నుంచి రెండు టీములు పాల్గొవచ్చునని పేర్కొన్నారు. విద్యార్థులు ఐడి కార్డు, ప్రిన్సిపల్ జారీ చేసిన ధృవీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. ఎస్‌ఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేస్తామని వెల్లడించారు. వివరాల కోసం 9966893484,9985444686లో సంప్రదించాలని సూచించారు.



విద్యార్థులతో ప్రజ్ఞ కరస్పాండెంట్ చక్రనాగ్, ప్రిన్సిపాల్ తదితరులు

'ప్రజ్ఞ'లో సందడిగా బాలల స్నాతకోత్సవం

గుంటూరు(విద్య),మార్చి 21: స్థానిక నగరంపాలెంలోని ప్రజ్ఞ మెడి టెక్నో స్కూల్లో ఎల్కేజీ యూకేజీ పూర్తి చేసుకున్న బాలబాలికలు ఒకటవ తరగతిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా 25వ సిల్వర్ జూబ్లీ బాలల స్నాతకోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పట్టభద్రుల వలే బ్లాక్ యాప్రాన్, క్యాప్ ధరించి పాస్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చక్రనాగ్ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు ఉపాధ్యాయులు లలిత, మాధవి, యశోద తదితరులు పాల్గొన్నారు.

చెన్నై సారథి రుతురాజ్

మహి
ళల ప్రీమియర్ లీగ్ ముగిసిందో..
లేదో.. అంతకు మించిన వినోదం రెడీగా ఉంది.
16 ఏళ్లుగా వన్నె తరగని రీతిలో అంతకంతకూ ఆకర్షణ పెంచుకుంటూ వస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్‌కు తెర లేవనుంది. ఇక రెండు నెలల పాటు బ్యాటర్ల బాదుడు.. ఫీల్డర్ల మెరుపు విన్యాసాలు.. బౌలర్ల అబ్బురపరిచే బంతులను ఈ క్రేజీ లీగ్‌లో మైమరిచి చూసేందుకు క్రికెట్ ప్రేమికులంతా సిద్ధంగా ఉండాల్సిందే. అలాగే రానున్న టీ20 వరల్డ్‌కప్‌లో బెర్త్ దక్కించుకునేందుకు యువ ఆటగాళ్లతో పాటు వెటరన్స్‌కు కూడా ఈ లీగ్ కీలకమే. దీనికి తోడు డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌తో ఆరంభమే ఘనంగా ఉండబోతోంది.

ధనాధన్‌కు సిద్ధమా!

నేటి నుంచే ఐపీఎల్ 17వ సీజన్

చెన్నై x బెంగళూరు మధ్య ఆరంభ పోరు

రాత్రి 8.00 నుంచి స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో..



కెప్టెన్సీ వదిలేసిన ధోనీ
సీజన్‌లో ఆడతాడు : కోచ్ ఫ్లెమింగ్

చెన్నై: ఐపీఎల్ ఆరంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ సారథి ధోనీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 16 ఏళ్లుగా ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా పేరు తెచ్చుకున్న ఎంఎస్ ధోనీ అనూహ్యంగా నాయకత్వ బాధ్యతలనుంచి వైదొలుతున్నట్టు ప్రకటించాడు. దీంతో ఇక నుంచి యువ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ జట్టును నడిపిస్తాడని సీఎస్‌కే వెల్లడించింది. లీగ్ ఆరంభానికి సరిగ్గా ఒకరోజు ముందు, ఎలాంటి ఊహాగానాలు లేకుండానే వెలువడిన ఈ వార్త అటు సీఎస్‌కే అభిమానులతో పాటు క్రికెట్ ప్రేమికులను కూడా షాక్‌లో ముంచింది. 'ఎంఎస్ ధోనీ తన కెప్టెన్సీని రుతురాజ్‌కు అప్పగించాడు. 2019 నుంచి గైక్వాడ్ జట్టులో భాగంగా ఉంటూ 52 మ్యాచ్‌లు ఆడాడు. అతడి నాయకత్వంలో జట్టు రాణిస్తుందని ఆశిస్తున్నాం' అని సీఎస్‌కే పేర్కొంది. శుక్రవారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో సీఎస్‌కే జట్టు రుతురాజ్ నేతృత్వంలోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ఆడనుంది. అయితే 27 ఏళ్ల రుతురాజ్‌కు కెప్టెన్‌గా చేయడం ఇదేం తొలిసారి కాదు. 2023 ఆసియా గేమ్స్‌లో భారత క్రికెట్ జట్టు అతడి ఆధ్వర్యంలోనే స్వర్ణం సాధించింది. దేశవాళీల్లో మహారాష్ట్ర జట్టుకు కూడా తనే కెప్టెన్. అలాగే గతేడాది తమ ఫ్రాంచైజీని చాంపియన్‌గా నిలపడంలో బ్యాటర్‌గా రుతురాజ్ పాత్ర కీలకం. ఆడిన 16 మ్యాచ్‌ల్లో 147.50 స్ట్రయిక్ రేట్‌తో 590 పరుగులు చేశాడు. వాస్తవానికి 2019లో జట్టులోకి వచ్చిన రుతురాజ్ పూర్తిగా బెంచీకే పరిమితమయ్యాడు. ఆ తర్వాత ఏడాది ఆరు మ్యాచ్‌లు ఆడగలిగాడు. కానీ 2021లో అద్భుతంగా చెలరేగి ఆరెంజ్ క్యాప్ (635) గెలుచుకోగా.. 2022లోనూ జట్టు తరఫున అతడివే అత్యధిక పరుగులు (368). అయితే విశేష అభిమానగణం ఉన్న సీఎస్‌కే నయా కెప్టెన్‌గా ఇప్పుడు ఏమేరకు రాణించగలడనేది వేచిచూడాల్సిందే..

మహియే వదిలేశాడు..

సీఎస్‌కే జట్టులో ధోనీ అంతర్భాగం. ఈ ఫ్రాంచైజీలో అతడేం చెబితే అదే జరుగుతుంది. ముంబై ఇండియన్స్ తరహాలో హార్దిక్‌ను కెప్టెన్‌గా చేసిన తీరును ఇక్కడ చూడలేం. అంతా ఎంఎస్ ఇష్టప్రకారమే జరిగిందని సాక్షాత్తూ సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథ్ తెలిపాడు. 'జట్టు ప్రయోజనాల కోసమే ధోనీ ఆలోచనలు ఉంటాయి. అతడి తాజా నిర్ణయం గురించి నాకు ఐపీఎల్ కెప్టెన్ల సమావేశానికి ముందు మాత్రమే తెలిసింది. కెప్టెన్‌గా వైదొలగడం కేవలం అతడి ఇష్టపూర్వకంగానే జరిగింది. మనం అతడి నిర్ణయాన్ని గౌరవించాల్సిందే' అని కాశీ తెలిపాడు.

ఇదే ఆఖరు!

ఐపీఎల్‌లో 2008 నుంచి సీఎస్‌కేను ఎంఎస్ అత్యద్భుత జట్టుగా మార్చాడు. అయితే జట్టు ఇప్పుడు సంధి దశలో ఉంది. బహుశా 42 ఏళ్ల ధోనీకిదే చివరి ఐపీఎల్. అందుకే జట్టులో తను కొనసాగినప్పుడే మరొకరికి పగ్గాలు అప్పజెప్పాలనుకున్నాడు. వాస్తవానికి 2022లోనే ధోనీకి ఈ ఆలోచన వచ్చి జడేజాను ముందుకు తెచ్చాడు. కానీ కేవలం 8 మ్యాచ్‌ల తర్వాత తిరిగి ధోనీయే నాయకుడయ్యాడు. అప్పుడు ఆ నిర్ణయం వర్కౌట్ కాలేదు కానీ ఈసారి అలా కాదని సీఈవో విశ్వనాథన్ చెబుతున్నాడు. అప్పట్లో తాము కూడా ఎంఎస్ నుంచి కెప్టెన్సీ మార్పునకు సిద్ధంగా లేమని, కానీ ఇప్పుడు ఆ పాత్రకు యువ ఆటగాళ్లను తయారుచేయాల్సిన అవసరం ఏర్పడిందని కోచ్ ఫ్లెమింగ్ చెప్పాడు. మరోవైపు ధోనీ బరిలోకి దిగుతాడా? లేదా? అని ఫ్యాన్స్ సందేహిస్తున్నారు. కొంతకాలం క్రితమే ధోనీ మోకాలికి సర్జరీ కూడా అయ్యింది. కానీ వీటన్నింటికి చెక్ పెడుతూ.. ఎంఎస్ సీజన్ మొత్తానికి అందుబాటులో ఉంటాడని ఫ్లెమింగ్ తేల్చాడు. గత సీజన్‌తో పోలిస్తే ఇప్పుడు తను మరింత ఫిట్‌గా ఉన్నాడని చెప్పాడు.

గైక్వాడ్‌కు జై..

ముంబై కెప్టెన్‌గా హార్దిక్‌ను నియమించినప్పుడు సోషల్ మీడియాలో అభిమానుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. కానీ రుతురాజ్‌పై మాత్రం సీఎస్‌కే ఫ్యాన్స్ అభిమానం కురిపిస్తుండడం విశేషం. ఓ దేశవాళీ మ్యాచ్‌లో ఎంఎస్ నుంచి ఆటోగ్రాఫ్ తీసుకున్న రుతురాజ్.. నేడు అతడి నుంచే సారథ్యం అందుకోవడం భేష్ అంటూ కొనియాడుతున్నారు. అలాగే ఎంఎస్ 26 ఏళ్ల వయస్సులో దేశానికి టీ20 వరల్డ్‌కప్ అందించి.. 27 ఏళ్లకు సీఎస్‌కే కెప్టెన్ అయ్యాడని.. అలాగే 26 ఏళ్ల రుతురాజ్ భారత్‌కు ఆసియాకప్ స్వర్ణం అందించి.. 27 ఏళ్లప్పుడే సీఎస్‌కే సారథి అయ్యాడని ఫ్యాన్స్ గుర్తుచేసుకుంటున్నారు.

కెప్టెన్‌గా ఎంఎస్ కెరీర్

ఐపీఎల్ ఆరంభం నుంచి చెన్నై కెప్టెన్‌గా కొనసాగిన ధోనీ రికార్డు స్థాయిలో ఐదు టైటిళ్లు అందించాడు. 2010, 2011, 2018, 2021, 2023లో విజేతగా నిలిచిన జట్టు తాజాగా డిఫెండింగ్ చాంపియన్‌గానే బరిలోకి దిగుతోంది. అలాగే రెండుసార్లు చాంపియన్స్ లీగ్‌లోనూ విజేతగా నిలిపాడు. లీగ్‌లో అత్యధిక మ్యాచ్‌లకు కెప్టెన్సీ (226) వహించిన రికార్డు కూడా ధోనీదే. ఇందులో 133 విజయాలు, 91 ఓటములు, రెండు ఫలితం తేలనివి ఉన్నాయి. మొత్తంగా సీఎస్‌కే, రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ తరఫున 250 మ్యాచ్‌లను ఆడిన ఎంఎస్ 5082 పరుగులు సాధించాడు.

'తలా' దర్శనం లేకపాయె..

ఎంఎస్ ధోనీని విపరీతంగా ఆరాధించే అభిమానులు అతడిని నెట్స్‌లో చూసేందుకు కూడా ఎగబడుతుంటారు. ఈ క్రమంలో గతంలో చిదంబరం స్టేడియం ప్యాక్ అయిన వీడియోలు చక్కర్లు కొట్టేవి. కానీ ఈసారి ముందుగానే తమ ఆరాధ్య 'తలా' దర్శనం చేసుకునేందుకు ఫ్యాన్స్‌కు వీలు కాలేదు. ఎందుకంటే.. దేశంలో సాధారణ ఎన్నికల నేపథ్యంలో అభిమానుల కోసం స్టాండ్స్‌ను తెరిచేందుకు స్థానిక పోలీసులు అనుమతించలేదు. వేలాది ఫ్యాన్స్ తరలివస్తారు కాబట్టే భద్రత కోసం పోలీసుల అనుమతి తీసుకోవడం అవసరం. దీంతో ఏప్రిల్ 19 ఎన్నికల తర్వాత ఫ్యాన్స్‌ను నెట్స్‌లోకి అనుమతించాలని సీఎస్‌కే భావిస్తోంది.



మెగాలీగ్ కెప్టెన్లు

రాహుల్ (లఖ్‌నవూ)
కమిన్స్ (సన్‌రైజర్స్)
జితేశ్ (పంజాబ్ వైస్‌కెప్టెన్)
రుతురాజ్ (చెన్నై)
రిషభ్ పంత్ (ఢిల్లీ)
డుప్లెసి (బెంగళూరు)
గిల్ (గుజరాత్)
శాంసన్ (రాజస్థాన్)
హార్దిక్ (ముంబై)
శ్రేయాస్ (కోల్‌కతా)

చెన్నై: టీ20 ప్రపంచకప్‌నకు ముందే అభిమానులకు కావాల్సినంత వినోదం లభించనుంది. నేటి నుంచే ఐపీఎల్ 17వ సీజన్ ఆరంభం. అయితే ఈసారి లీగ్ సమయంలోనే దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగనుండడంతో ప్రస్తుతానికి 15 రోజుల షెడ్యూల్‌నే ప్రకటించారు. దీనిలో భాగంగా శుక్రవారం నుంచి ఏప్రిల్ 7 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరుగబోతున్నాయి. ఈమేరకు మొత్తంగా పది జట్లు, పది వేదికల్లో 21 మ్యాచ్‌ల్లో తలపడతాయి. మిగతా షెడ్యూల్ స్వదేశంలో ఉంటుందా? తటస్థ వేదికల్లో నిర్వహిస్తారా? అనేది తేలాల్సి ఉంది. మరోవైపు జాతీయ జట్టులో సహచరులుగా ఉన్న వారే ఇక మైదానంలో ప్రత్యర్థులుగా సవాల్ విసురనున్నారు. అటు ఫ్యాన్స్ కూడా తమ ఫ్రాంచైజీల వారీగా విడిపోయి విదేశీ ఆటగాళ్లకైనా జేజేలు పలికేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపుగా అన్ని జట్లలో పలువురు కీలక ఆటగాళ్ల గాయాలతో దూరమైనా.. ఏ మాత్రం కళ తప్పని ఈ లీగ్‌లో స్టార్ ప్లేయర్లతో పాటు యువ ఆటగాళ్లు కూడా ఆకట్టుకోవాలనుకుంటున్నారు. అలాగే కారు ప్రమాదం నుంచి కోలుకుని తిరిగి బ్యాట్ పట్టనున్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషభ్ పంత్ ఎలా రాణిస్తాడనేది ఫ్రాంచైజీతో పాటు భారత టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఆత్రుతగా ఎదురుచూస్తోంది..

విరాట్‌కు కీలకం



తాజా లీగ్‌లో అందరికళ్లూ విరాట్ కోహ్లీపైనే ఉండనున్నాయి. ధనాధన్ ఫార్మాట్‌లో యువ ఆటగాళ్లు దూసుకువస్తుండడంతో టీ20 జట్టులో విరాట్ స్థానం సందేహంగా మారింది. ఈ లీగ్ ముగిశాక జూన్ 2 నుంచి టీ20 వరల్డ్‌కప్ ఉండడంతో ఆయా ఆటగాళ్ల ఫామ్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇప్పటికే విరాట్‌కు చోటు సందేహమనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీంతో ఈ ఐపీఎల్‌లో తనను తాను నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. 2022 టీ20 వరల్డ్‌కప్ ముగిశాక విరాట్ ఆడింది కేవలం రెండు టీ20 మ్యాచ్‌లే కావడం గమనార్హం. వాస్తవానికి తన టీ20 ఫామ్ మరీ అంత పేలవంగా ఏమీ లేదు. 117 మ్యాచ్‌ల్లో 138.15 స్ట్రయిక్ రేట్‌తో ఈ ఫార్మాట్‌లో అత్యధికంగా 4,037 పరుగులు సాధించాడు.

ఆటలో 'విలువ' కనిపిస్తుందా?

డిసెంబరులో జరిగిన ఐపీఎల్ వేలంలో కనీవినీ ఎరుగని రీతిలో పలువురు ఆటగాళ్లను ఆయా ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్‌ను కోల్‌కతా జట్టు ఏకంగా రూ.24 కోట్ల 75 లక్షలకు తీసుకుంది. తమ పేస్ దళానికి ప్రధాన ఆయుధంగా పనికివస్తాడనే భావనలో కేకేఆర్ ఈ రికార్డు ధరకు మొగ్గు చూపింది. ఇక ప్యాట్ కమిన్స్ కోసం సన్‌రైజర్స్ రూ.20 కోట్ల 50 లక్షలను వెచ్చించింది. ఆసీస్‌కు టీ20 ప్రపంచకప్‌ను అందించినట్టే తమకు కూడా టైటిల్‌ను అందిస్తాడనే ఆశతో కెప్టెన్‌గానూ నియమించుకుంది. ఇక కామెరూన్ గ్రీన్‌ను ముంబై నుంచి బెంగళూరు రూ.17.50 కోట్లకు తీసుకుంది. వీరే కాకుండా కొందరు అనామక ఆటగాళ్లు కూడా కోట్లు పలికారు. ఈ విలువైన క్రికెటర్లు ఫ్రాంచైజీల ఆశలను తీరుస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.

బోణీ కొట్టేదెవరో?

టోర్నీ ఆరంభానికి ఒక్క రోజు ముందు ఎంఎస్ ధోనీ నాయకత్వం నుంచి తప్పుకొన్నాడు. కొత్త కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్..డుప్లెసి నేతృత్వంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తాజా ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌ల్లో తలపడనున్నాయి. దీంతో తొలి మ్యాచ్‌లోనే భారత అభిమానులకు ధోనీ వర్సెస్ కోహ్లీ పోరు చూసే అవకాశం దక్కింది. సీఎస్‌కే టైటిల్ కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా.. ఆర్‌సీబీ మాత్రం తీవ్ర ఒత్తిడిలోనే బరిలోకి దిగబోతోంది. డబ్ల్యూపీఎల్‌లో తమ ఫ్రాంచైజీ విజేతగా నిలవడంతో బెంగళూరు అభిమానుల ఫోకస్ పురుషుల జట్టుపైకి మారింది. పేరుతో పాటు జెర్సీలోనూ మార్పు చేసుకున్న ఈ జట్టు 16 ఏళ్లుగా ఊరిస్తున్న ఐపీఎల్ ట్రోఫీని ఎలాగైనా అందుకోవాలనే కసితో ఉంది. కొన్నేళ్లుగా ఇదే చివరి లీగ్‌గా అందరూ భావిస్తున్నా ధోనీ మాత్రం ప్రతీ సీజన్‌లో ఫ్యాన్స్‌ను మురిపిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు కూడా 42 ఏళ్ల వయస్సులో అత్యంత ఫిట్‌గా కనిపిస్తూ సీఎస్‌కే ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నాడు. ఇక ఓపెనర్ కాన్వే, పేసర్ పథిరన గాయాలతో ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నారు. ధోనీతో పాటు రుతురాజ్, మిచెల్, జడేజా, రహానె, రచిన్, దీపక్, తుషార్ కీలక ఆటగాళ్లు. అటు ఆర్‌సీబీకి మాత్రం గాయాల బెడద లేకుండా ఆటగాళ్లంతా ఫిట్‌గా ఉన్నారు. కోహ్లీ కూడా సుదీర్ఘ విరామంతో తాజాగా కనిపిస్తున్నాడు. డుప్లెసి, మ్యాక్స్‌వెల్, దినేశ్ కార్తీక్, గ్రీన్, పటీదార్‌లతో ఆర్‌సీబీ బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. పేసర్లు సిరాజ్, జోసెఫ్, ఫెర్గూసన్‌లపై జట్టు బౌలింగ్‌లో ఆధారపడి ఉంది.



క్వార్టర్స్‌లో గాయత్రి, రజావత్



బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో గాయత్రీ గోపీచంద్ జంట, ప్రియాన్షు రజావత్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. గురువారం జరిగిన మహిళల డబుల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 21-10, 21-12తో సహచర ద్వయం ప్రియ/శృతీ మిశ్రాపై సునాయాసంగా నెగ్గింది. పురుషుల సింగిల్స్ రౌండ్-16 పోరులో రజావత్ 21-14, 21-13తో లీ లాన్ జీ (చైనా)ను చిత్తు చేసి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. ఇక మహిళల డబుల్స్ మరో రెండో రౌండ్‌లో అశ్వినీ పొన్నప్ప జంట పరాజయం పాలైంది. జపాన్‌కు చెందిన హిరోకామీ/కటోతో జరిగిన మ్యాచ్‌లో అశ్విని/తనీషా క్రాస్టో 17-21, 16-21తో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

'ద హండ్రెడ్'లో భారత్ నుంచి ఇద్దరే!



లండన్: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్ చాంపియన్ జట్టు ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన, కీపర్ రిచా ఘోష్‌కు మాత్రమే రాబోయే 'ద హండ్రెడ్' లీగ్‌లో చోటు దక్కింది. సదరన్ బ్రేవ్ జట్టు మంధానను తీసుకోగా, ఆమె ఆర్సీబీ సహచరి రిచా ఘోష్‌పట్ల బర్మింగ్‌హామ్ ఫినిక్స్ జట్టు మొగ్గు చూపింది. ఎడమచేతి వాటం బ్యాటర్ స్మృతి తాజా డబ్ల్యూపీఎల్ 10 మ్యాచ్‌ల్లో 300 రన్స్‌తో సత్తా చాటింది. మరోవైపు ఫినిషర్‌గా అదరగొట్టిన ఘోష్ 10 మ్యాచ్‌ల్లో 142 స్ట్రయిక్ రేట్‌తో, రెండు అర్ధ శతకాలు సహా 257 పరుగులు సాధించింది. ఇన్నింగ్స్‌కు 100 బంతుల చొప్పున ఉండే ఈ లీగ్ లండన్‌లో జూలై 23 నుంచి జరగనుంది. మొత్తం ఎనిమిది జట్లు టోర్నమెంట్‌లో తలపడనున్నాయి. భారత్ నుంచి హర్మన్‌ప్రీత్, దీప్తిశర్మ, జెమీమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్ సహా మొత్తం 17 మంది భారత క్రికెటర్లు హండ్రెడ్ లీగ్ డ్రాఫ్ట్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ జట్లేవీ వారిని తీసుకొనేందుకు ఆసక్తి చూపలేదు.

పారిస్ ఒలింపిక్స్

భారత పతాకధారి శరత్ కమల్

చెఫ్ డి మిషన్‌గా మేరీకోమ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత పతాకధారిగా వెటరన్ టీటీ ఆటగాడు శరత్ కమల్ వ్యవహరించనున్నాడు. ఈమేరకు కామన్వెల్త్ క్రీడల చాంపియన్ శరత్ పేరును భారత ఒలింపిక్ సంఘం గురువారం ప్రకటించింది. అలాగే దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌ను చెఫ్ డి మిషన్‌గా ఎంపిక చేసింది. కాగా..ర్యాంకింగ్స్ ఆధారంగా భారత పురుషులు, మహిళల టీటీ జట్లు పారిస్ ఒలింపిక్స్ టీమ్ విభాగాలకు అర్హత సాధించిన విషయం విదితమే. 'క్రీడల పట్ల అసమాన అంకితభావం, ఎందరికో స్ఫూర్తిగా నిలిచే మేరీకోమ్ చెఫ్ డి మిషన్‌గా భారత అథ్లెట్లకు మార్గదర్శనం చేయనుంది' అని ఐఓఏ తెలిపింది.

ఐపీఎల్‌కు జంపా దూరం

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆరంభానికి ముందు రాజస్థాన్ రాయల్స్‌కు గట్టిదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా ఆటగాడు ఆడమ్ జంపా మెగా లీగ్ నుంచి వైదొలిగాడు. జంపాను రాజస్థాన్ రూ. 1.5 కోట్లకు రిటైన్ చేసుకొంది. అయితే, గత కొంతకాలంగా తీరికలేని క్రికెట్ ఆడుతున్న జంపా విశ్రాంతి నిమిత్తం తప్పుకొన్నట్టు తెలుస్తోంది. జంపా తప్పుకోవడంతో స్పిన్ భారం అశ్విన్, యజ్వేంద్ర చాహల్‌పైనే పడనుంది. గత సీజన్‌లో రాయల్స్ తరఫున ఆరు మ్యాచ్‌లు ఆడిన జంపా 8 వికెట్లు పడగొట్టాడు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఎన్నికల నియమావళి పాటించాలి

● సబ్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రకార్‌జైన్

తెనాలి అర్బన్, మార్చి 21 : నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ ఎన్నికల నియామవళి అనుసరించాలని సబ్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రకార్‌జైన్ కోరారు. ప్రతి రాజకీయ పార్టీ ర్యాలీలు, సభలు, ఇంటింటి ఎన్నికల ప్రచారం కోసం అనుమతులు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఎన్నికల కమిషన్ సువిధ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. యాప్‌లో దరఖాస్తు చేసుకున్న 48గంటలలోగా పర్మిషన్ ఇస్తామన్నారు. ఫిర్యాదులను టోల్‌ఫ్రీ నెంబరు 08644232475లో తెలపాలని చెప్పారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

తెనాలి అభివృద్ధికి కలిసి నడుద్దాం..!

● వెండి, బంగారు నగల వర్తక సంఘంతో నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మార్చి 21: రానున్న ఎన్నికల్లో అందరూ కలిసి తనను గెలిపిస్తే భరోసాగా ఉంటూ తెనాలి ప్రాంత అభివృద్ధికి కలసి నడుద్దామని జనసేన పీఏసీ ఛైర్మన్, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం పట్టణంలోని ది తెనాలి వెండి, బంగారు నగల వర్తక సంఘంతో జైన్ టెంపుల్ వీధిలో నాదెండ్ల మనోహర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తెనాలి అభివృద్ధి పథంలో నడవకపోగా వ్యాపారులు భయంభయంగా బతికే పరిస్థితి వచ్చిందన్నారు. దుకాణాల్లో చోరీలు, వ్యాపారులపై దాడులు, బెదిరింపులు వంటివి గత ఐదేళ్లలో చూశామని ఆరోపించారు. గతంలో తెనాలి ప్రాంతమంటే ప్రశాంతతకు నిలయంగా ఉండేదన్నారు. ఇకనైనా ఈ ప్రభుత్వాన్ని సాగనంపి అందరికీ మంచి చేయగలిగిన తనను, ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన మనోహర్‌ను సంఘ నాయకులు దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు కొల్లూరు రామలింగేశ్వరరావు, అధ్యక్షుడు నెమిచంద్ గోవాణి, కార్యదర్శి వెల్లంపల్లి సత్యనారాయణమూర్తి, కోశాధికారి కొల్లూరు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొల్లూరు రాంప్రసాద్, కాళిదాసు రవికుమార్, భవిరిశెట్టి సత్యనారాయణ పలువురు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



నాదెండ్ల మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న చింతమనేని ప్రభాకర్

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన చింతమనేని

తెనాలి రూరల్, మార్చి 21: దెందులూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చింతమనేని ప్రభాకర్ గురువారం తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కలిశారు. పోలవరం సీటు జనసేన పార్టీకి కేటాయించడం జరిగిందని సీటు టీడీపీ, జనసేన ఏ పార్టీకి కేటాయించినా ఆయా పార్టీల అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషిచేస్తామన్నారు. దీనిపై మనోహర్‌ను కలిసి మాట్లాడటం జరిగిందని చింతమనేని విలేకరులకు వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించనున్నారని వైసీపీ అరాచకపాలన ఎంతోకాలం సాగదన్నారు. తొలుత మనోహర్‌ను కలిసిన చింతమనేని పుష్పగుచ్ఛం అందించి రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలపై చర్చించి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడుకున్నారు. పలువురు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపర శ్రీజనార్ధనస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు

జనార్ధనస్వామి ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

కొల్లిపర, మార్చి 21: మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం పండితులు జగన్నాధాచార్యులు, యోగానంద పృధ్వీబార్గవ్, వీరభద్రేశ్వరశర్మ, ప్రసాదశర్మ, వెంకటేశ్వరశర్మ, సీతారామాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మలు స్వామివారికి వివిధ అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను చూడటానికి వివిధ గ్రామాల నుంచి మహిళలు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. స్వామివారికి పూర్ణాహుతి, ధ్వజావరోహణ వంటి పూజలు చేసిన అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించడంతో భక్తులు హారతులు ఇచ్చారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

● పెమ్మసానికి వీరవల్లి మురళి వినతి
● అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తా
● ఆత్మీయ సమావేశంలో పెమ్మసాని



డాక్టర్ పెమ్మసానికి మెమొంటోను అందిస్తున్న గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, ఉపసర్పంచ్ నాగభూషణం తదితరులు

తెనాలి మారీసుపేట, మార్చి 21: అంగలకుదురులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారం చేపట్టిన వెంటనే పరిష్కరిస్తానని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ స్థాయి నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని అంగలకుదురులో గణేష్‌యూత్ కన్వీనర్ , టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరవల్లి మురళి, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంలో గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పెమ్మసానికి క్షేత్రస్థాయిలో చూపించి వివరించారు. గ్రామంలో పారుదల లేని మురుగు డ్రెయిన్‌ల దుస్థితిని చూపించారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే డ్రెయిన్లు పూడికలు లేక గడ్డిజాతి మొక్కలు, వ్యర్థాలతో నిండి నీటి పారుదల కాకపోవడంతో పంటలు పండించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. గతంలో తాము సొంత ఖర్చులతో డ్రెయిన్ల మరమ్మతులకు రైతులకు సాయమందించినట్లు గుర్తుచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధిపనులు కుంటుపడ్డాయని పార్టీ నాయకులపై కూడా దాడులు జరుగుతున్నాయని వివరించారు. అంగలకుదురు తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా నిలవడంతో ఈ ప్రభుత్వం గ్రామంపై పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గ్రామంలో రైతాంగానికి ఉపయోగపడేలా డొంకల నిర్మాణపనులు కూడా పూర్తి స్థాయిలో చేపట్టకపోవడం, సాగు చేసేందుకు అవసరమైన కాలువల మరమ్మతులు సకాలంలో చేపట్టకపోవడం వంటి పలు సమస్యలతో వ్యవసాయం దండగ అంటూ ఇక్కడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. గ్రామంలో ఎందరో మంచి విద్యాభ్యాసం చేసి ఉద్యోగాలు లేక పొరుగు రాష్ట్రాలకు వలస పోవాల్సి వస్తుందని తాము ఒక చోట బిడ్డలు మరోక చోట అంటూ తల్లి దండ్రులు కూడా ఆవేదన చెందుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామానికి యువతకు, రైతులకు భరోసాగా నిలిచేలా పాలన ఉండాలని కోరారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికి రాష్ట్రానికి, సొంత భూమికి సేవ చేయాలన్న ఆశయంతో రాజకీయాల్లోకి రావడం జరిగిందన్నారు. ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం అన్న ఎన్టీఆర్ మాటలే తనకు స్ఫూర్తి దాయకమన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను ఆదుకోవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తానన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులకు అవసరమైన ఏర్పాట్లతోపాటు మన ప్రాంతంలోనే కొత్త పరిశ్రమలను తీసుకువచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు నెలకొల్పుతానన్నారు. వైసీపీ అరాచకపాలనపై ప్రజలందరూ విసుగు చెందారన్నారు. రాష్ట్రాన్ని దివాళాతీసిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ప్రకృతి సంపదైన మట్టి, ఇసుక, భూములను పేదవాడిపేరుతో దోచుకున్నాడని దుయ్యబట్టారు. ప్రజలు తెలివైన వారని వైసీపీ ప్రభుత్వం ఇకనైనా గుర్తించాలన్నారు. సరైన సమయంలో ఈ ప్రభుత్వానికి బుద్ధిచెబుతారని రానున్న ఎన్నికలే అందుకు సాక్షంగా నిలుస్తాయన్నారు. పార్టీ శ్రేణులందరూ కలిసికట్టుగా ముందుకు నడిచే సమయం ఆసన్నమైందని రాష్ట్రాన్ని రామరాజ్యంగా మార్చే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన కోరారు. గ్రామానికి విచ్చేసి డాక్టర్ పెమ్మసానిని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం పలువురు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి, మెమొంటోను మురళి అందించారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మాట్లాడుతూ టీడీపీ, జనసేన మరియు బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, పార్టీ శ్రేణులు అందరం కలసి కృషిచేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో కనగాల శ్రీనివాసరావు, బొద్దులూరి వేణు, ఆలపాటి వెంకట్రామయ్య, గొల్లపూడి సాయిగిరి, ఎల్ఎంఎల్ ఖాదర్, కంచర్ల నరేంద్ర, వాకా శ్రీకాంతరెడ్డి, మొప్పవరపు సాంబశివరావు, చెన్నుపాటి చిట్టి, కె రవీంద్ర, ఎలీషా పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు, గణేష్‌యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల రోడ్‌షో

● పెమ్మసాని, నాదెండ్ల, ఆలపాటికి పూలజల్లులతో ఘనస్వాగతం
● భారీసంఖ్యలో పాల్గొన్న అభిమానులు







పెమ్మసాని, నాదెండ్ల, ఆలపాటికి గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్న అభిమానులు, హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

తెనాలి రూరల్, మార్చి 21: తెనాలి మండలంలో గురువారం నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల ఎన్నికల ప్రచార రోడ్‌షోకు పార్టీ శ్రేణులు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. గురువారం సాయంతం తెనాలి మండలం జాకీర్ హుస్సేన్ నగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం రోడ్‌షో ప్రారంభమైంది. అక్కడకు భారీగా చేరుకున్న పార్టీల శ్రేణులు, అభిమానులతో రోడ్డు మార్గం నిండిపోయింది. గుంటూరు పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి ఎమ్మెల్యే ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్, తెనాలి టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు ప్రచారరథంపై నుంచి ప్రజలకు పార్టీ శ్రేణులకు, అభిమానులకు అభివాదం చేస్తూ రోడ్డుషో ప్రారంభించారు. అడుగడుగునా జననీరాజాల నడుమ సాగినరోడ్‌షో హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు గ్రామం వరకూ కొనసాగింది. ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు వారికి పూలమాలలు వేస్తూ మహిళలు హారతులతో స్వాగతం పలికారు. గ్రామాల్లోని పలు సమస్యలను ఆయా గ్రామస్థులు వారికి విన్నవించారు. అధికారం చేపట్టిన వెంటనే ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని నేతలు ప్రజలకు హామీ ఇచ్చారు. దారిపొడవునా ప్రచారరథంపై పూలవర్షం కురిపించారు.

పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లపై కమిషనర్ పరిశీలన

తెనాలి అర్బన్, మార్చి 21: పట్టణంలోని పాఠశాలల్లో ఉన్న పోలింగ్ స్టేషన్‌లను మున్సిపల్ అధికారులు గురువారం పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్ని బూత్‌లు ఏర్పాటయ్యింది. ఏయే ఏర్పాట్లు చేసింది కమిషనర్ శేషన్న విచారించారు. ఓటర్లు వచ్చి పోయేందుకు ప్రతి బూత్ అనుకూలంగా ఉన్నది లేనిది, వృద్ధులు వెళ్లేందుకు ర్యాంపులు, రైలింగ్ ఉన్నది లేనిది పరిశీలించారు. ప్రతి బూత్‌పైన బీఎల్‌వో పేరు, ఫోన్ నెంబరు, బూత్ నెంబరు విధిగా ఉండాలన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. 40 వార్డులలో ఉన్న 1, 13, 29 వార్డులో మోడల్‌గా తీర్చిదిద్దిన కేంద్రాలను సందర్శించారు. కేవలం మహిళలు మాత్రమే వెళ్లే పోలింగ్ బూత్‌లలో టాయిలెట్ల వసతులు సరిగా ఉన్నది లేనిది విచారించారు. ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదు చేసే అవకాశం కల్పించిందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో పేరు పరిశీలించుకోవాలని, లేనిపక్షంలో వెంటనే ఓటు నమోదు చేసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన

పట్టణంలోని మూడు కళాశాలల్లో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కమిషనర్ శేషన్న గురువారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యార్థులలో 18 ఏళ్ల వయస్సు నిండి ఉంటే ఓటు హక్కు లభిస్తుందన్నారు. ఎవరైనా దరఖాస్తులు చేసుకోని పక్షంలో వెంటనే సంబంధిత వెబ్‌సైట్ సందర్శించి దరఖాస్తు చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్క యువకుడు ఓటు హక్కు కలిగి ఉండాలని చెప్పారు. ప్రజాస్వామ్యం విజయవంతం అయ్యేందుకు ఓటు హక్కుదోహదపడుతుందన్నారు. రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: ఎంఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో సాల్మన్ రాజు

కొల్లిపర, మార్చి 21: ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని చక్రాయపాలెం ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో రికార్డులను తనిఖీచేసి ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం విషయంలో ప్రధానోపాధ్యాయులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏజన్సీ నిర్వాహకులు ఆ జాగ్రత్త వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

సాంకేతిక బోధనపై కేంద్ర బృందం పరిశీలన



వెనిగండ్ల జడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్, విద్యాశాఖ అధికారులు

గుంటూరు (విద్య), పెదకాకాని, మార్చి 21: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సాంకేతిక విద్యాబోధనకు 'ప్రైమ్ మినిస్టర్ ఎక్సలెన్స్' అవార్డుకు ఆంధ్రప్రదేశ్ ఎంపికైంది. అవార్డు ప్రదానం చేసే ముందుగా ఇద్దరు అధికారులతో కూడిన కేంద్ర బృందం గురువారం జిల్లాలోని పాఠశాలల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో బోధన తీరు, తెన్నులను పరిశీలించేందుకు కేంద్ర డిప్యూటీ కార్యదర్శులు ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ గురువారం గుంటూరు జిల్లాలోని పెదకాకాని మండలం వెనిగండ్ల జడ్పీ హైస్కూల్, గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పట్టాభిపురంలోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ), బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల ద్వారా జరుగుతున్న బోధనను కేంద్ర అధికారులు పరిశీలించారు. ఇంజనీరింగ్ విద్యార్థులను పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన 'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్' కార్యక్రమాన్ని పరిశీలించిన అధికారులు విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు.

ట్యాబ్‌ల వినియోగంపై 8, 9 తరగతుల విద్యార్థులతో మాట్లాడిన ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్ వారిలోని మేథస్సు, సబ్జెక్టుల వారీగా పట్టు, ఇంగ్లీషు భాషలో పరిజ్ఞానాన్ని పరిశీలించారు. టీం వెంట సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి, ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, డీఈవో పి.శైలజ, సీఎస్ఈ ఐటీ సెల్ ప్రతినిధి రమేష్, పెదకాకాని మండలం విద్యాధికారులు బలి రామ్ నాయక్, శంకర్ రాజు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

'పసుపు రైతులను ఆదుకోవాలి'



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

తెనాలి అర్బన్, మార్చి 21 : దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదం కారణంగా నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలని సబ్ కలెక్టర్ ప్రకార్‌జైన్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రమాదం జరిగిన 62 రోజులు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సీజ్‌చేసిన గోడౌన్‌లోని వెయ్యి బస్తాల పసుపును కోల్డ్ స్టోరేజీ యజమాని అక్రమంగా తరలించే ప్రయత్నంలో ఉన్నారని చెప్పారు. రైతులు రామయ్య, శివయ్య, రమేష్, కోటేశ్వరరావు, సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి పాల్గొన్నారు.

అంబటి బ్రదర్స్‌కు ఓటమి ఖాయం

● టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్

పెదకాకాని, మార్చి 21: వచ్చే ఎన్నికల్లో అంబటి బ్రదర్స్‌కు ఓటమి ఖాయమని రాష్ట్ర టీడీపీ నాయకులు కొర్రపాటి సురేష్ తెలిపారు. గురువారం పెదకాకాని మండలం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సురేష్ మాట్లాడుతూ వినుకొండలో బొల్లా బ్రహ్మనాయుడు, అనుమర్లపూడిలో కిలారి రోశయ్య అనుచరులు ఎస్సీ, ఎస్టీ భూములు బ్యాంకుల్లో తనఖాలుపెట్టి కోట్లు గడించారని, సత్తెనపల్లిలో అంబటి రాంబాబు భూకబ్జాలు చేసి బినామీల పేరు మీద అమ్ముకున్నారని బాధితులు రోడ్డెక్కలేదా అని ప్రశ్నించారు. మూటలు ముట్టచెప్పి ఎమ్మెల్యే ఎంపీ టికెట్‌లు కొనుక్కోవచ్చునుకున్న వారిని, తాడేపల్లి దొంగల ముఠాను పొన్నూరులోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పారదోలేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తెలుగు యువత జిల్లా కార్యదర్శి లింగంగుంట రామకృష్ణ మాట్లాడుతూ కిలారి రోశయ్య వ్యాఖ్యలలో నీతి నిజాయితీ ఉంటే సీబీఐ విచారణ జరుపుకునేందుకు సిద్ధమా అని సవాల్ చేశారు. ప్రజాదరణ లేక ధూళిపాళ్ల నరేంద్ర, పెమ్మసాని చంద్రశేఖర్‌పై నోరుపారేసుకుంటున్నారన్నారు. పొన్నూరు ఎస్సీసెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయవాడ గూండాలకు ప్రత్తిపాడు అసెంబ్లీ టికెట్ కట్టబెట్టి దళిత ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ కలెక్టర్ రామాంజనేయులుపై దాడికి పాల్పడటం వైసీపీ పిరికిపంద చర్యలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు షేక్ రషీద్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆర్.రవిసాగర్, మండల టీడీపీ నేతలు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన నాయకులను అభినందిస్తున్న నరేంద్ర కుమార్

ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యం: ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, మార్చి 21: ప్రజా సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యం అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. గురువారం మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మినుగ సుబ్బారావు, షేక్ అబ్దుల్ వహాబ్, షేక్ మాలిక్ అహ్మద్, ఆకుల రమణయ్య తదితర నాయకులు కుటుంబాలతో సహా నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. 18వ వార్డులో జరిగిన కార్యక్రమంలో నరేంద్ర కుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలకులకు ప్రజలు అపరిమిత అధికారం అందిస్తే పాలన చేతకాక అన్ని రంగాలలో విఫలమయ్యారన్ని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన మంచి ఏమీలేక అక్రమ కేసులు, అసత్య ప్రచారాలపై మనుగడ సాగించిందని దుయ్యబట్టారు. బీజేపీతో పొత్తు ఉన్న సమయంలో 2014 నుంచి 2019 వరకు ముస్లిం సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలను అమలుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. రానున్న రోజులో ఆ నాటి సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ అహ్మద్‌ఖాన్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, షేక్ బాజి సాహెబ్, రషీద్, సర్దార్, ఎన్.నారాయణరావు, జాలాది కోటేశ్వరరావు, ఎం సుభాషిని, అన్నిశెట్టి వీరబాబు, పినపోతుల గోపి, కంకిపాటి చక్రి, జనసేన నాయకులు దేశంశెట్టి సూర్య తదితరులు పాల్గొన్నారు.

మృతులకు నరేంద్ర నివాళి



మృతులకు నివాళి అర్పిస్తున్న నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మార్చి 21: పట్టణంలోని 8వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు నిలా సౌరి మృతి చెందారు. గురువారం నిలా సౌరి మృతదేహాన్ని నరేంద్ర కుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిలా సౌరి సోదరుడు మాజీ కౌన్సిలర్ జ్ఞాన సుందరరావు, కుటుంబ సభ్యులను నరేంద్ర కుమార్ పరామర్శించారు. అలాగే 13వ వార్డుకు చెందిన చేబ్రోలు ప్రసాద్ మృతి చెందారు. ప్రసాద మృతదేహాని సందర్శించిన నరేంద్ర కుమార్ నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కర్ర మహేష్ ఆధ్వర్యంలో ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో చేబ్రోలు అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎద్దు సోంబాబు, చల్లపల్లి శోభరాజు, కర్ర హరిబాబు, యాతాటి గోపి, యాతాటి చౌదరి, బొట్టు డేవిడ్, తిరుపతి రమేష్, పులి కిషోర్, చేబ్రోలు కిషోర్, కత్తి లక్ష్మణరావు, చేబ్రోలు రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీపై విష ప్రచారం మానుకోవాలి

● టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ బాజీసాహెబ్

పొన్నూరు టౌన్, మార్చి 21: వైసీపీ ఐదేళ్లలో అభివృద్ధి పనులు చేయలేక ఎన్నికల ముందు నాటకాలు ఆడుతూ టీడీపీపై చేస్తున్న విషప్రచారం మానుకోవాలని టీడీపీ సీనియర్ నాయకులు షేక్ బాజీసాహెబ్ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ పొన్నూరు పట్టణంలో వైసీపీ నాయకులు మున్సిపల్ అధికారులు కొత్త నాటకానికి తెరతీశారని ఆరోపించారు. 4ఏళ్ల 10 నెలల కాలం నిద్రపోయి అభివృద్ధిని విస్మరించారన్నారు. మార్చి 16న ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ప్రత్యేక అధికారిపై ఒత్తిడిచేసి మార్చి 14న కౌన్సిల్ తీర్మానం చేసినట్లు అదేరోజు వర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత పట్టణంలో హడావుడిగా అభివృద్ధి పనులు ప్రారంభించారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు పనులను నిలుపుదల చేస్తే టీడీపీ వారు పనులు ఆపించారని వైసీపీ నాయకులు విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు ఆపాల్సిన అవసరం టీడీపీకి లేదన్నారు. పనులు చేయలేక, నిధులు లేకపోవటంతో వైసీపీ నాయకులే పనులు ఆపించుకొని ఆ నెపాన్ని టీడీపీపై నెడుతున్నారని ధ్వజమెత్తారు. 27వ వార్డులో ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత రోడ్ పనులు మొదలు పెడితే అధికారులు ఆపుతారని తెలిసికూడా పనులు మొదలు పెట్టారని ఆరోపించారు. విష ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆకుల సాంబశివరావు, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ చౌదరి, తోట ప్రసాద్, అన్నిశెట్టి వీరబాబు, యరసాని శ్రీరామమూర్తి, సిలార్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని 20వ వార్డు మెంబర్ టీడీపీలో చేరిక



నరేంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ వార్డు సభ్యుడు షేక్ బాజీ

పెదకాకాని, మార్చి 21: పెదకాకాని మండలం పెదకాకాని గ్రామ ముస్లింపాలెం చెందిన 20వ వార్డు వైసీపీ మెంబర్ షేక్ బాజీ గురువారం చింతలపూడిలో పొన్నూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షేక్ బాజీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేసి భారీ మెజార్టీతో గెలిచే విధంగా తమవంతు సహకారాన్ని అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ మైనారిటీ అధికార ప్రతినిధి షేక్ శిలార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టినేనికి ఘన నివాళి

పొన్నూరు టౌన్, మార్చి 21: మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకట్రావు 24వ వర్ధంతి కార్యక్రమాలు గురువారం పట్టణంలో జరిగాయి. వీబీఎస్ కళాశాల రోడ్డులోని వెంకట్రావు సమాధి వద్ద ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శరణాలయంలో యామిని శ్రీహరి ఆధ్వర్యంలో వృద్ధులు, అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చిట్టినేని అభిమానులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు



కోడి పందెల నిర్వాహకులను అరెస్టు చూపిస్తున్న రూరల్ పోలీసులు

పొన్నూరు టౌన్, మార్చి 21: నిబంధనలకు విరుద్ధంగా కోడి పందేలు నిర్వహిస్తున్న పద్నాలుగు మందిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ వై కోటేశ్వరరావు తెలిపారు. కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీఐ కోటేశ్వరరావు ఎస్ఐ బండ్ల భార్గవ్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. మండల పరిధిలోని మాచవరం గ్రామం టీబీ డ్రెయిన్ కట్టపై సోదాలు నిర్వహించగా కోడి పందెలు ఆడుతున్న పద్నాలుగు మందిని అరెస్టుచేసి వారివద్ద నుంచి 33వేల నగదు, ఆరు కోడి పుంజులు, 16 కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

24న ప్రపంచ టీబీ డే

తెనాలి అర్బన్, మార్చి 21: ఈ నెల 24న ప్రపంచ టీబీ డే జరుగుతుందని టీబీ యూనిట్ కోఆర్డినేటర్ రాధిక తెలిపారు. వారం రోజులుగా పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. క్షయ వ్యాధిపై అవగాహన కల్పించిన సిబ్బందిని సత్కరిస్తామని చెప్పారు.